PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 74 | పేజీలు : 8 | మంగళవారం 11 ఆగస్టు 2026 | వెల : 4/-

PRGI.NO.TGTEL/26/A2002
నవగీతం
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
నవగీతం తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాలో నియోజకవర్గ ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
Cell: +919912484184
Email: navageetamnews@gamil.com
Website: www.navageetam.com



## ఝార్ఖండ్ అసెంబ్లీ ముట్టడిలో ఉద్రిక్తత

- విద్యార్థులపై లాఠీఛార్జ్, వాటర్ కేనాన్ల ప్రయోగం
- పరీక్షల్లో అక్రమాలపై రాంచీలో విద్యార్థుల భారీ నిరసన
- అసెంబ్లీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులు
- బారికేడ్లు తొలగించేందుకు యత్నించడంతో వాటర్ కేనాన్లతో పోలీసులు అడ్డుకట్ట

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చే ప్రతిపాదన లేదు

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై రాజ్యసభలో కీలక ప్రకటన చేసిన కేంద్రం
- ఈ ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీకి వచ్చిన ప్రతిపాదనను వెనక్కి పంపినట్లు తెలిపిన కేంద్రం
- ఎంపీ రేణుకా చౌదరి అడిగిన ప్రశ్నకు సమాధానం



**హైదరాబాద్**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కేంద్రం రాజ్యసభలో కీలక ప్రకటన చేసింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చే ప్రతిపాదన లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీకి వచ్చిన ప్రతిపాదనను వెనక్కి పంపినట్లు తెలిపింది. కృష్ణా జలాల వినియోగంపై పాలమూరు ప్రాజెక్టు ఆధారపడి ఉందని పేర్కొంది. మరోవైపు కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-×× విధివిధానాల్లో ఉండటంతో ఈ వ్యవహారం కోర్టు పరిధి విచారణలో ఉందని కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుపై సాంకేతిక-ఆర్థిక మదింపు సాధ్యం కాదని కేంద్ర పేర్కొంది. ఈ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయహోదా ఇవ్వాలంటే సాంకేతిక-ఆర్థిక మదింపు తప్పనిసరి అని, కోర్టు పరిధిలో ఉన్నందున ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను వెనక్కి - మిగతా 3లో

# ప్రాజెక్టులకు నిధుల కోసం..




- టార్గెట్ 3,000 కోట్లు
- మరోసారి మెగా వేలానికి హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్
- కోకాపేట్ నియోపొలిస్, గోల్డ్‌మైల్ లే అవుట్‌లపై ప్రధానంగా దృష్టి
- మోకిలా తదితర ప్రాంతాల్లోని భూములకు సెప్టెంబర్‌లో ఆన్‌లైన్ బిడ్డింగ్
- ఎలివేటెడ్ కారిడార్‌లు, రేడియల్ రోడ్లు, మెట్రో స్వాదీనానికి నిధుల సేకరణ

**హైదరాబాద్**

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) మరోసారి భూముల అమ్మకాలకు చర్యలు చేపట్టింది. రూ.3 వేల కోట్లు సమీకరణ లక్ష్యంగా.. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్లాట్లు, భూ విభాగాలు, ఎకరానికి పైగా విస్తీర్ణం కలిగిన భూముల విక్రయానికి తాజాగా నోటిఫికేషన్ వెలువరించింది. వివిధ ప్రాంతాల్లో ఉన్న స్థలాలకు ఆగస్టు నెలాఖరులో ప్రీబిడ్డింగ్ సమావేశాలను ఏర్పాటు చేసి సెప్టెంబర్ మొదటి వారంలో ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించను న్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కోకాపేట్‌లో ఎకరానికి రూ.150 కోట్ల వరకు ధర రావడంతో ప్రస్తుతం కోకాపేట్ లోని నియోపొలిస్, గోల్డ్‌మైల్ లే అవుట్‌లలోని భూములపై అధికారులు మరోసారి సీరియస్‌గా దృష్టి సారించారు. నియోపొలిస్‌లో ఎకరానికి రూ.120 కోట్లు, గోల్డ్‌మైల్‌లో రూ.70 కోట్ల చొప్పున కనీస ధర నిర్ణయించారు. నియోపొలిస్‌లోని 239, 240 సర్వే నంబర్లలో - మిగతా 3లో




## గందరగోళం సృష్టించడమే ఆయన లక్ష్యం

- సభలో నుంచి పారిపోవద్దు రాహుల్
- సజావుగా పనిచేయకుండా అడ్డుకోవడమే వారి ఉద్దేశం: బీజేపీ
- గత 15 రోజులుగా పార్లమెంటుకు ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగిస్తున్నారని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ధ్వజం
- అమిత్ షా ఇచ్చే సమాధానాన్ని వినే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా అని రిజిజు ప్రశ్న

## మోదీ, షా ధైర్యం చేయడంలేదు

- పార్లమెంటులో ప్రతిష్టంభన తొలగించేందుకు కాంగ్రెస్ 3 డిమాండ్లు
- ఢిల్లీలో యువతపై దాడికి ఆదేశించింది అమిత్ షానా కాదో చెప్పాలని డిమాండ్
- యువతపై జరిగిన దాడికి ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- రామమందిరంలో దొంగతనం అంశంపైనా చర్చకు డిమాండ్




# ఉదాసీనంగా ఉన్న బీఎల్ఏలను తొలగించండి



- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్
- సోమవారం నుంచి పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్ నాయకులతో జూమ్ సమావేశాలు
- మొదటి రోజు ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ సమావేశాలు
  నేటితో మొదటి దశ పూర్తి అవుతుంది
- మంగళవారం నుంచి సర్ రెండో దశ ప్రారంభం అవుతుంది
- ఈ దశలోనే చాలా అప్రమత్తంగా ఉండాలి

**హైదరాబాద్**

ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) మొదటి దశ ప్రక్రియ కంటే రెండో దశలో బీఎల్ఏలు మరింత అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నుంచి పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్ నాయకులతో జూమ్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ - మిగతా 3లో



## రామమందిర పూజారులకు కొత్త డ్రెస్ కోడ్

ఇకపై రోజూ పసుపు రంగు వస్త్రాలే!

# వర్షాలు కురవాలి.. ప్రాజెక్టులు నిండాలి

- మహా వరుణ యాగంలో సీఎం రేవంత్‌రెడ్డి
- కృష్ణమ్మకు పూర్ణాహుతి సమర్పణ
- రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడాలని ప్రార్థన
- నాగార్జునసాగర్‌లోని కృష్ణా తీరాన శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు
- 108 మంది రుత్వికులు.. 11 హోమ గుండాలు



**నల్లగొండ**

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహం వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో క్రతువులు నిర్వహించారు. కృష్ణమ్మకు సీఎం పూర్ణాహుతి సమర్పించారు. 'రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి. ప్రాజెక్టులు, చెరువులు నిండాలి..'అని ప్రార్థించారు. సోమవారం ఉదయం 4 గంటలకు బ్రహ్మ ముహూర్తంలో యాగాన్ని ప్రారంభించారు. ప్రారంభ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమ గుండాలతో వరుణ దేవుని అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ వైదిక విధానంలో హోమ క్రతువులు నిర్వహించారు. - మిగతా 3లో

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్..

- ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!
- ఢిల్లీలోని ఫేక్ కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు
- తెలుగు మాట్లాడే యువతులనే టెలీకాలర్లుగా నియమించుకున్న కేటుగాళ్లు
- లోన్ల పేరుతో మోసం, 21 మంది యువతులతో పాటు వ్యక్తి అరెస్టు
- ప్రధాన సూత్రధారులు పరారీ, కొనసాగుతున్న దర్యాప్తు



# మోదీ, షా ధైర్యం చేయడంలేదు



ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్ షాలు 15 రోజులుగా పార్లమెంటుకు వచ్చే ధైర్యం చేయడంలేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంటులో ప్రతిష్టంభనపై ఖర్గే, రాహుల్ గాంధీ ఢిల్లీలోని ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్?లో మాట్లాడారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్‌పై మాట్లాడేందుకు హోంమంత్రి అమిత్ షా సిద్ధమైన వేళ కాంగ్రెస్ తరపున 3 డిమాండ్లు చేశారు. ఢిల్లీలో యువతపై దాడికి అమిత్ షా ఆదేశించారో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన దాడికి ప్రధాని క్షమాపణ చెప్పాలని, రామమందిర అంశంపై కూడా మాట్లాడాలని ఖర్గే, రాహుల్ స్పష్టంచేశారు. ఇవే డిమాండ్లను తాము గత 15 రోజులుగా చేస్తున్నట్లు వారివురూ చెప్పారు. పార్లమెంట్‌లో సాధారణ అంశాలపై అమిత్ షా చేసే ప్రసంగం పట్ల దేశానికి ఆసక్తి లేదన్నారు.

"మొదటి షరతు జరిగిన దానికి ఎవరు బాధ్యులు, ఎవరు దోషులో స్పష్టత కావాలి. రెండోది జరిగిన దానికి ప్రధాని క్షమాపణ చెప్పాలి. మూడోది రామమందిరం దొంగతనం. ఖర్గే వివరించినట్లుగా ప్రధానికి అత్యంత సన్నిహితులు రామమందిరం నుంచి నగదును దొంగిలించారు. ప్రధానంగా ఇవే ఆ మూడు అంశాలు. ఇప్పుడు అకస్మాత్తుగా అమిత్ షా మాట్లాడతానంటే ఆయన కల్పిత మాటలపై మాకు ఆసక్తి లేదు. పిల్లలపై కాల్పులు జరపడానికి ఆయన అనుమతి ఇచ్చారా లేదా అన్నదే మాకు కావాలి. ముందుగా ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. తర్వాతే చర్చ ప్రస్తావన వస్తుంది. మరో విషయం ప్రధాని, హోంమంత్రి తీరు. 15 రోజులుగా వారిద్దరికీ సభకు వచ్చే ధైర్యం లేకపోయింది. తాము చేసిన దాన్ని ఒప్పుకునే దమ్ము వారిలో ఎవరికీ లేదు. విద్యార్థులు అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే ఢిల్లీలో మీకు జరిగిన దాని గురించి, క్రూరత్వం గురించి కనీసం స్పందించాల్సిన అవసరం ఉందని ఈ దేశ హోంమంత్రిగానీ, ప్రధానమంత్రిగానీ అనుకోవడం లేదు."

**మోదీ, అమిత్ షా మౌనం వహిస్తున్నారు : షా**

మరోవైపు రామ మందిర విరాళాల వివాదం, నీట్ పేపర్ లీక్‌పై నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసుల చర్యపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మౌనం వహిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఈ రెండు విషయాలపై ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "విద్యార్థులపై పెల్లెట్ గన్లు, టియర్ గ్యాస్, లాఠీచార్జ్ ఎందుకు ఉపయోగించారో కేంద్ర హోం మంత్రి వచ్చి చెప్పడమే మా మొదటి డిమాండ్. ప్రధాని మోదీనే ఈ ట్రస్ట్‌ను ప్రకటించి, ఏర్పాటు చేశారు. మోదీకి నమ్మకమైన ట్రస్టీలు రామ మందిరంలో దొంగతనానికి పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వివరాలను ప్రధానే స్వయంగా వెల్లడించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కానీ ఇప్పటివరకు ఏం జరగలేదు. దోషులకు శిక్ష పడాలని, ప్రధాని దీనిపై ప్రకటన చేయాలని మేము కోరాం. కానీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. గత 15 రోజులుగా ప్రధాని, హోం మంత్రి ఈ అంశాలపై మాట్లాడలేదు. మేము ఈ అన్ని అంశాలపై పోరాడుతున్నాం. లక్షలాది మందికి రామమందిరంపై విశ్వాసం ఉన్నప్పటికీ, ఇంత పెద్ద ఘటన జరిగినప్పుడు ప్రధాని మోదీ మౌనం వహించారు. కాబట్టి ఆయన క్షమాపణ చెప్పాలి. ఈ మూడు అంశాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. మేము ఈ అంశాలపై పోరాడుతున్నాము. వీటిపై మేము దృఢంగా ఉన్నాం. ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాల్సిందే" అని ఖర్గే అన్నారు.

**ఝార్ఖండ్‌లో విద్యార్థులపై బలప్రయోగం తప్పు : రాహుల్**

ఇదిలా ఉండగా, ఝార్ఖండ్?లో యువత నిర్వహిస్తున్న ఆందోళనపైనా రాహుల్ గాంధీ స్పందించారు. "ఝార్ఖండ్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగం తప్పు. విద్యార్థులకు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉంది. చర్చలు మాత్రమే పరిష్కారాలను చూపగలవు. ఝార్ఖండ్ ప్రభుత్వం ఈ విద్యార్థుల వాదనలను విని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలి." అని రాహుల్ ఎక్స్?లో పోస్ట్ చేశారు.

# ఝార్ఖండ్ అసెంబ్లీ ముట్టడిలో ఉద్రిక్తత



ఝార్ఖండ్‌లో నియామక పరీక్షల నిర్వహణలో భారీగా అవకతవకలు జరిగాయని రాంచీలో విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. అసెంబ్లీ వైపు భారీ సంఖ్యలో విద్యార్థులు ర్యాలీగా కదిలారు. అసెంబ్లీ ముట్టడిలో భాగంగా ఆందోళనకారులు భద్రతా బలగాలు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వాటర్ కేనాన్లను ప్రయోగించి వారిని వెనక్కి పంపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ముందుకు దూసుకెళ్తున్న భారీ జనసమూహాన్ని అడ్డుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆందోళనకారులపై లాఠీఛార్జ్ చేశారు.

జాతీయ జెండాలు చేతపట్టిన విద్యార్థులు బారికేడ్లను తోసుకుని అసెంబ్లీ వైపు ముందుకు వెళ్లేందుకు నిరసనకారులు తీవ్రంగా యత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థులకు మధ్య తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బారికేడ్లను ఛేదించుకుని వస్తున్న ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు వారిపై జల ఫిరంగులు ప్రయోగించారు. అయితే, ఈ ఉద్రిక్తతల మధ్య పలువురు విద్యార్థులు బారికేడ్ల పైకి ఎక్కి నిలబడ్డారు. పోలీసులు తమపైకి వాటర్ క్యానన్లతో నీటిని కొడుతున్నప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ నీటి ధారల మధ్యే బారికేడ్ల పైనే డ్యాన్స్ చేస్తూ తమ నిరసనను వినూత్నంగా వ్యక్తపరిచారు. అయితే ఈ నిరసనల్లో స్పైడర మ్యాన్ ముసుగు ధరించి ఓ వ్యక్తి పాల్గొన్నారు. ప్రభుత్వం తమ మాటలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఝార్ఖండ్?కు వచ్చినట్లు తెలిపాడు. అసలు ప్రభుత్వం మాట వినడానికి ఏదైనా చేయడానికి కూడా ఇష్టపడటం లేదని చెప్పాడు.

**ఆందోళనలో దేవేంద్రనాథ్ మహతో**

ఝార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారి మోర్చా (జేఎల్?కేఎం) నేత దేవేంద్రనాథ్ మహతో కూడా నిరసనలో పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ చిత్రపటాన్ని చేతబూని ఆయన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి చేరుకున్నారు. గత తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న మహతో అంబులెన్స్‌లో ఆందోళన ప్రాంతానికి వచ్చినట్లు తెలిపారు. నిరాహార దీక్షలో ఉన్నా, ముళ్ల కంచెలు మమ్మల్ని ఆపలేవని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లను వినాల్సిందేని అన్నారు. తనను హీరోగా చూడొద్దని, తాను సాధారణ వ్యక్తినేనని పేర్కొన్నారు. విద్యార్థులు మూడు అంచెల బారికేడ్లను దాటారని చెబుతూ, ప్రభుత్వం వారి డిమాండ్లపై ఎందుకు సానుకూలంగా స్పందించడం లేదని ప్రశ్నించారు.

**'రక్తపాతం జరగకూడదు'**

ఆందోళనకారులపై పోలీసు చర్యలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను దేవేంద్రనాథ్ కోరారు. నిరసన సమయంలో ఎవరూ గాయపడకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అరెస్టు చేయడం చట్టపరమైన ప్రక్రియేనని, అయితే ఎలాంటి రక్తపాతం చోటుచేసుకోకూడదని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లను అంగీకరించకపోతే ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన ప్రభుత్వంగా గుర్తుండిపోతుందని వ్యాఖ్యానించారు. తన నిరాహార దీక్షను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

ఆందోళనకారులతో ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ, ప్రతిష్టంభనను తొలగించడంలో విఫలమైంది. చివరి విడత చర్చల అనంతరం, నిరసనకారుల డిమాండ్లలో 98 శాతాన్ని అంగీకరించామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, రద్దు చేయాలని కోరిన 13 పరీక్షల్లో కేవలం మూడింటిని మాత్రమే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని నిరసనకారులు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలన్న తమ డిమాండ్ నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదు అని స్పష్టం చేశారు. జేఎస్?ఎస్?సీ- సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని కూడా కోరుతున్నారు. ఇదే సమయంలో జేపీఎస్?సీ నిర్వహించిన పరీక్షల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం కీలక చర్య చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది. విద్యార్థుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన అక్రమాలపై దర్యాప్తు అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

# రామమందిర పూజారులకు కొత్త డ్రెస్ కోడ్

అయోధ్య రామమందిర పూజారుల వస్త్రధారణలో మార్పులు చేశారు. ఇకపై రామమందిర గర్భగుడిలోకి ప్రవేశించే సమయంలో పూజారులు రామానందాచార్య సంప్రదాయం ప్రకారం కుట్టని పసుపు రంగు వస్త్రాలను ధరించనున్నారు. ముఖ్యంగా సిల్క్‌తో తయారైన కుట్టని ఉత్తరీయాన్ని ధరించాలని నిర్ణయించారు. చలికాలంలో కూడా ఇదే తరహా కుట్టని ఉన్ని వస్త్రాలను ఉపయోగించనున్నారు. రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ అనంతరం పూజారులు చౌబందీ (కుర్తా) ధరించే విధానం అమల్లో ఉంది. తాజాగా పూజా వ్యవస్థను రామానందాచార్య సంప్రదాయం, ప్రాచీన వైష్ణవ ఆచారాలకు అనుగుణంగా రూపొందించేందుకు నిబంధనల్లో మార్పులు చేస్తున్నారు. ఆలయంలో పూజా కార్యక్రమాలకు శాశ్వతమైన, క్రమబద్ధమైన విధానాన్ని తీసుకురావడమే లక్ష్యంగా ఆ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**పూజారులకు ప్రత్యేక నియమావళి**

సోమవారం జరిగిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మతపరమైన కమిటీ సమావేశంలో పూజారులకు సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది. పూజారుల నియామకం, వారి ఆచరణ, రోజువారీ విధులు, పూజా విధానం, భగవంతుడి అలంకరణ, నైవేద్యం, హారతి, ఇతర ధార్మిక కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక నియమావళిని రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న విధానాలను సమీక్షించి ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా వాటిని మరింత స్పష్టంగా రూపొందించనున్నారు. ఇందుకోసం నియమావళి ముసాయిదాపై కమిటీ సభ్యులు చర్చించారు. త్వరలోనే ఆ నిబంధనలను ఖరారు చేసి రామమందిరంలోని నిత్యపూజా కార్యక్రమాల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. పూజారుల వస్త్రధారణపై కమిటీ సభ్యుడు రాజ్?కుమార్ దాస్ కీలక వివరాలు వెల్లడించారు. పూజారులంతా సిల్క్‌తో తయారైన కుట్టని ఉత్తరీయాన్ని ధరించనున్నట్లు తెలిపారు. శీతాకాలంలో కూడా అదే విధానాన్ని అనుసరిస్తూ కుట్టని ఉన్ని వస్త్రాలను ధరిస్తారని చెప్పారు.

**ఆలయ నిర్వహణపై చర్చ**

అదే సమయంలో రామమందిర నిర్వహణకు సంబంధించి కూడా మతపరమైన కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆలయ నిర్వహణకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)ను నియమించాల్సిన అవసరం లేదని మతపరమైన కమిటీ సభ్యుడు మహంత్ మిథిలేశ్ నందినీ శరణ్ అభిప్రాయపడ్డారు. అయితే ప్రభుత్వం లేదా ట్రస్ట్? అటువంటి నియామకం చేస్తే తాను వ్యతిరేకించబోనని స్పష్టం చేశారు. ఆలయాల నిర్వహణలో ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రాధాన్యం ఉండాలని ఆయన అన్నారు. ఆలయాలు, మఠాలు, ఆశ్రమాల సంప్రదాయాలతో అనుబంధం ఉన్నవారికి నిర్వహణలో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పరిపాలనా సామర్థ్యం ఉన్న వ్యక్తి ఆలయాన్ని నిర్వహించగలిగినా ఆయన దృష్టి పూర్తిగా పరిపాలనా వ్యవస్థపైనే ఉండే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. దేశంలోని పలు ప్రముఖ ఆలయాల నిర్వహణ సీఈవోల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయితే రామమందిరం వంటి పవిత్ర క్షేత్రాల్లో ఆధ్యాత్మిక సంప్రదాయాలు, పూజా విధానాలకు తగిన ప్రాధాన్యం ఉండాలని స్పష్టం చేశారు. ఇక అయోధ్య రామమందిరంలో ఆగస్టు 15 నుంచి 12 రోజుల పాటు ఝూలనోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నూతనంగా ఏర్పాటు చేసిన మతపరమైన కమిటీ సభ్యులు ఇప్పటికే తొలి సమావేశంలో చర్చించారు. ఉత్సవం తొలి రోజు ఉత్తర ద్వారం నుంచి రామ్?లల్లా ఉత్సవ విగ్రహంతో పల్లకి యాత్ర నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన ద్వారం ముందు నుంచి ఆ యాత్ర కొనసాగి ప్రాకార ప్రాంతం, ఆలయ పరిసరాల మీదుగా కుబేర్ టీలా వరకు చేరుకోనుంది. అక్కడ సుమారు రెండు గంటల పాటు ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమాలు పూర్తైన తర్వాత ఉత్సవ విగ్రహాన్ని తిరిగి గర్భగుడికి తీసుకురానున్నారు. అనంతరం రామ్?లల్లాను బంగారు అలంకరణతో కూడిన వెండి ఉయ్యాలలో ఆశీనులను చేయనున్నారు. ఝూలనోత్సవం తొలి రోజు రామ్?లల్లా ప్రాచీన కుబేర్ టీలా వద్ద ఝూలాలో ఆశీనులై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం శృంగార హారతి అనంతరం స్వామివారిని ఝూలాలో ఉంచనున్నారు. మధ్యాహ్నం భోగ సమర్పణ సమయంలో కొద్దిసేపు తెరను మూసివేస్తారు. అనంతరం భక్తులకు మళ్లీ ఝూలాలో స్వామి వారి దర్శ కల్పించనున్నారు.

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్..

ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మూడు మోసపూరిత కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బజాజ్ ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించి 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 21 మంది తెలుగు యువతులు, ఒక బ్యాంకు ఖాతాదారుడు ఉన్నారు. గత 18 నెలలుగా ఈ ముఠా చురుకుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులుగా ఫోన్లు చేసి, ఆకర్షణీయమైన రుణాలను ఆమోదించినట్లు నమ్మించేవారు. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజులు, వెరిఫికేషన్ చార్జీలు, డాక్యుమెంటేషన్, ఇన్సూరెన్స్ వంటి పేర్లతో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. ఈ మోసాలకు పాల్పడేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే యువతులనే నియమించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్ల, హైదరాబాద్‌లోని సైదాబాద్, బోరబండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి యువతులను టెలీకాలర్లుగా రిక్రూట్ చేసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు ఢిల్లీలోని శివ మార్కెట్ కేంద్రంగా ఈ కాల్ సెంటర్లను నడిపిస్తున్నారని, ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 22 సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సందర్భంగా 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన యువతుల వయసు 20 నుంచి 42 ఏళ్ల మధ్య ఉంది. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం గాలింపు ముమ్మరం చేశామని, మనీ ట్రయల్‌పై దృష్టి సారించి మోసం పూర్తి స్థాయిని అంచనా వేస్తున్నామని పోలీసులు తెలిపారు.జ

## గందరగోళం సృష్టించడమే ఆయన లక్ష్యం

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గత 15 రోజులుగా పార్లమెంటుకు ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగిస్తూ, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రాహుల్? గాంధీ డిమాండ్‌ను అంగీకరించి, నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం ఒప్పుకుందని, కానీ ఆయన పదేపదే మాట మారుస్తూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. "రాహుల్ గాంధీ పార్లమెంటులో, జాతీయ చర్చలోనూ రోజూ తన వాదనలను మారుస్తూనే ఉన్నారు. చర్చలు జరపడం కాదు, గందరగోళం సృష్టించడమే ఆయన లక్ష్యం. పార్లమెంటు సమావేశాలు ప్రారంభంలో ఆయన నీట్?పై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. మేము దానికి అంగీకరించినప్పుడు ఆయన ఆ విషయాన్ని రామ మందిర్ ట్రస్ట్ వైపు మళ్లించారు. ఆ తర్వాత, జంతర్ మంతర్ వద్ద జరిగిన ఘటనపై హోం మంత్రి ఒక ప్రకటన చేయాలని పట్టుబట్టారు. ముఖ్యంగా, సభ సజావుగా పనిచేయకుండా అడ్డుకోవడమే ఆయన ఉద్దేశం. సభ పనిచేయడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే గత 15 రోజులుగా సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తూనే, ఒకవైపు జంతర్ మంతర్ విషయంపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అంతకుముందు మీరు ూ×= అంశంపై చర్చను కోరారు. దానిపై సమగ్రమైన చర్చ కూడా జరిగింది. కానీ మేము సమాధానం ఇచ్చే సమయానికి మీరు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ధరల పెరుగుదలపై చర్చను కోరారు. మేము దానిపై చర్చను చేపట్టాము. ప్రభుత్వం సమాధానం ఇస్తున్నప్పుడు, సభలో కూర్చుని వినే ధైర్యం కూడా కాంగ్రెస్ పార్టీకి లేకుండా పోయింది. ఇదే వారి చరిత్ర, ఇదే వారి రికార్డు. అందుకే, వారు చర్చ కోరిన ఏ రాజకీయ అంశంపై అయినా సరే చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. రాహుల్ గాంధీని మరోసారి సభకు రావాలని సవాలు చేస్తున్నాను. మేము చర్చకు సిద్ధంగా ఉన్నాం. మీకు తగిన సమాధానం లభిస్తుంది. అలాగే, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను. జంతర్ మంతర్ వద్ద ఎలాంటి కాల్పులు జరగలేదు. అలాగే అక్కడ కాల్పులు జరపాలని ఎటువంటి ఆదేశాలు కూడా ఇవ్వలేదు." "ఝార్ఖండ్‌లో విద్యార్థుల గొంతుకలు వారికి వినిపించడం లేదా నా సమాచారం ప్రకారం, అక్కడ ముళ్ల కంచెలను వారి సూచన మేరకే ఏర్పాటు చేశారు. ఎందుకంటే అక్కడ ప్రభుత్వాన్ని నడుపుతున్న పార్టీ వారి ఇండీ కూటమిలో అంతర్భాగమే కదా. అక్కడ విద్యార్థుల ఆవేదన వారికి వినిపించడం లేదా? రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు, దేశ భవిష్యత్తు లేదా దేశ పురోగతి పట్ల వారికి ఎలాంటి నిజమైన శ్రద్ధ లేదని స్పష్టం చేస్తున్నాయి. వారి చర్యలు ఎప్పుడూ అరాచకాన్ని సృష్టించడం, ప్రతికూల రాజకీయాలు చేయడం, బాధ్యతారహితమైన ప్రతిపక్ష పాత్ర పోషించడం వరకే పరిమితమయ్యాయి. నేను దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాను." అని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు.

**రాహుల్ గాంధీ పారిపోవద్దని నేను కోరుతున్నాను : రిజిజు**

పార్లమెంటులో నెలకొన్న ప్రతిష్టంభన వేళ విద్యార్థుల నిరసనలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం మరోసారి స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇచ్చే సమాధానాన్ని వినే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంపీ, లోక్?సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విలేకరుల సమావేశంపై స్పందిస్తూ రిజిజు ఈమేరకు వ్యాఖ్యానించారు. "నీట్ విషయంలో విద్యార్థుల నిరసనలపై చర్చించడానికి ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని నేను ఇప్పటికే స్పష్టంగా చెప్పాను. పార్లమెంటులో పూర్తి స్థాయి సమాధానం ఇవ్వడానికి హోం మంత్రి అమిత్ షా సంసిద్ధంగా ఉన్నారు. పార్లమెంట్?లో చర్చ, హోం మంత్రి సమాధానం కోసం రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారు. మేము దానికి సిద్ధంగా ఉన్నాం. చర్చ నుంచి ఎవరు పారిపోతారో ఇప్పుడు చూద్దాం. విద్యార్థుల నిరసనలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అమిత్ షా గారి సమాధానాన్ని వినే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా లేక వారు పారిపోతారా అనేది ఇప్పుడు తేలుతుంది" "మీరు (రాహుల్ గాంధీ) ఆరోపణలు చేసి పారిపోతారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదు. మీరు దీన్ని ఎదుర్కోవాలి. కాంగ్రెస్ కోరుకున్నంత సేపు చర్చించడానికి, సమాధానం ఇవ్వడానికి హోం మంత్రి సిద్ధంగా ఉన్నారు. రాహుల్ గాంధీ పారిపోవద్దని నేను కోరుతున్నాను. సాకులు చెప్పాల్సిన అవసరం లేదు. ప్రధాన మంత్రి నుంచి సమాధానం కోరడం లేదా క్షమాపణ చెప్పాలని పట్టుబట్టడం కేవలం నాటకం. మేము లోక్‌సభలో సూటిగా చర్చ జరగాలని కోరుకుంటున్నాం. రాహుల్ గాంధీ దీని నుంచి పారిపోలేరు. చర్చను డిమాండ్ చేసి పారిపోవడం పిరికివాడి లక్షణం. స్పీకర్ ఎప్పుడు సమయం కేటాయిస్తే అప్పుడు అది మంగళ, బుధవారం చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం. కాంగ్రెస్ పార్టీ పారిపోకూడదు." అని కిరణ్ రిజిజు అన్నారు.

## 6 వేల కిలోమీటర్లు ప్రయాణించి చైనాను తాకిన ప్రచండ టైఫూన్ 'డాల్ఫిన్'...

ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన టైఫూన్ 'డాల్ఫిన్' తూర్పు తీర ప్రాంతంలో ప్రళయం సృష్టిస్తోంది. ఆదివారం సాయంత్రం తీరం దాటిన ఈ టైఫూన్ కారణంగా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు 10 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. టైఫూన్ ప్రభావంతో రవాణా, పర్యాటక రంగాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఆదివారం సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో జెజియాంగ్ ప్రావిన్స్‌లోని యుహువాన్ నగరం సమీపంలో డాల్ఫిన్ టైఫూన్ తీరాన్ని తాకింది. ఆ సమయంలో గంటకు 151 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచాయి. గంట వ్యవధిలోనే సమీపంలోని వెన్‌జౌ నగరం వద్ద రెండోసారి తీరం దాటింది. దీంతో అధికారులు దేశంలోనే అత్యున్నత స్థాయి 'రెడ్ అలర్ట్' జారీ చేశారు. టైఫూన్ తీరం దాటినప్పటికీ, దాని ప్రభావం కొనసాగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు చేపట్టిన సహాయక చర్యలు మునుపెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఉన్నాయి. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 9 లక్షల మందిని, తైజౌలో 3.90 లక్షల మందిని, ఫుజియాన్ ప్రావిన్స్‌లో 1.67 లక్షల మందిని, షాంఘైలో 2.15 లక్షల మందికి పైగా ప్రజలను లోతట్టు ప్రాంతాల నుంచి ఖాళీ చేయించారు. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 1,500 అత్యవసర పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. టైఫూన్ కారణంగా రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఒక్క షాంఘైలోనే సుమారు 1,500 విమాన సర్వీసులు రద్దయ్యాయి. హ్యాంగ్‌జౌ విమానాశ్రయంలోనూ వందలాది విమానాలు నిలిచిపోయాయి. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 686 రోడ్డు మార్గాలు, 658 రైలు సర్వీసులను నిలిపివేశారు. పోర్టులు, ఫెర్రీ సేవలు కూడా మూతపడ్డాయి. షాంఘైలోని ప్రఖ్యాత లెగోలాండ్ రిసార్ట్‌ను తాత్కాలికంగా మూసివేశారు. అలాగే, 234 ప్రధాన పర్యాటక కేంద్రాలను మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఆగస్టు 2026

# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చే ప్రతిపాదన లేదు

-మొదటిపేజీ తరువాయి

పంపినట్లు కేంద్రం ప్రకటించింది. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్రం సమాధానం ఇచ్చింది.

**ఉన్నత స్థాయి కమిటీ నియమించిన రాష్ట్రం**

మరోవైపు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులపై తెలంగాణ సర్కార్ ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రాజెక్టుకు సంబంధించి చెల్లించే బిల్లులపై మరింత పారదర్శకంగా ముందుకెళ్తోంది. కాంట్రాక్టు ఒప్పంద నిబంధనలు, టెండర్? ప్రక్రియ, పనుల్లో జాప్యం, పెరుగుతున్న వ్యయం ఇలా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని మూడు దశాబ్దాల క్రితం జారీ చేసిన జీవో-94లో మార్పులు చేసేందుకు ఇటీవలే ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా సవరించిన అంచనాకు ఆమోదం తెలిపినా, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో నిబంధనలు మరింత కఠినతరం చేస్తూ నిర్ణయం తీసుకొంది.

**గతంలో కొన్ని కారణాల వల్ల జాప్యం**

పాలమూరు నుంచి రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని 7,11,15,17వ ప్యాకేజీల సవరించిన అంచనాలకు జులై 17న జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీనివల్ల ఖజానాపై అదనంగా రూ.2,353.38 కోట్ల భారం పడింది. 2016లో ఈ నాలుగు ప్యాకేజీల పనులకు



ఒప్పందం జరగ్గా, భూ సేకరణలో ఆలస్యం, ఎన్జీటీలో కేసులు తదితర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగింది. 10 ఏళ్లైనా ఇంకా పనులు పూర్తి కాలేదు. ఒప్పందం ప్రకారం జరగకపోవడంతో పెరిగిన ధరల వర్తింపు, అదనంగా పని చేయాల్సి రావడం, జీఎస్టీతో సహా పెరిగిన పన్నుల భారం వల్ల భారీగా అంచనాలు పెరిగాయి.

# మళ్లీ జలజగడం...

**హైదరాబాద్ :** తెలంగాణలో ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే సెంటిమెంట్ రగులుతోంది. ప్రధానంగా "నీటి సెంటిమెంట్" తో ప్రతిపక్ష బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తుంది. తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఏపీకి తరలిస్తున్నారని, గోదావరి, కృష్ణా నదీ జలాలపై రగడ మొదలయింది. తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్ కు తాకట్టు పెడుతున్నారంటూ గులాబీ పార్టీ కాంగ్రెస్ పై మండి పడుతుంది. తన గురువు చంద్రబాబు కోసం గోదావరి, కృష్ణా నీటిని తెలంగాణకు దక్కకుండా ఏపీకి తరలించుకు పోతున్నా మౌనంగా ఉంటున్నారని ఆరోపణలను గుప్పిస్తుంది. దీనికి కాంగ్రెస్ పార్టీ ఘాటుగా కౌంటర్ ఇస్తుంది.తెలంగాణ చరిత్ర తెలంగాణ రాజకీయాల్లో 'నీళ్లు' అనేది కేవలం వనరు మాత్రమే కాదు, ఉద్యమ పునాది నుంచి బలమైన భావోద్వేగ సెంటిమెంట్. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో "నీళ్లు, నిధులు, నియామకాలు" నినాదంలో నీళ్లే ప్రథమ స్థానంలో నిలిచాయి. సమైక్య రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ రాజకీయ పార్టీలు ఎప్పుడూ ప్రజలను ఏకం చేస్తుంటాయి. తెలంగాణ ఉద్యమం వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాలు. సెంటిమెంట్ మానంగా దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలు పాలకుల నిర్లక్ష్యంతో సీమాంధ్రకు తరలిపోయాయనే ఆవేదన తెలంగాణ సమాజంలో ఉండేది. తాగు, సాగునీరు అందక ఎండిన భూములు, వలసల నేపథ్యమే తెలంగాణ రాజకీయ అస్తిత్వానికి ప్రధాన ప్రాతిపదికగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా నీటి హక్కుల రక్షణే ప్రధాన అజెండాగా సాగుతోంది. గోదావరి, కృష్ణా నదీ జలాల కేటాయింపులు,






బోర్డుల సమావేశాల అజెండాలు రాష్ట్రంలో తరచూ తీవ్ర రాజకీయ రగడకు దారితీస్తున్నాయి.పక్క రాష్ట్రాల ప్రాజెక్టుల విస్తరణ లేదా కొత్త ప్రతిపాదనలు పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమదే నీటి హక్కుల పరిరక్షణ అంటుంటే, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల ప్రారంభాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక శక్తిగా ఉంటాయి.నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందనే చిన్న సంకేతం కూడా తెలంగాణలో వెంటనే బలమైన రాజకీయ వ్యతిరేకతను, సెంటిమెంట్‌ను రగిలిస్తుంది. మరి ఈ సెంటిమెంట్ ఎప్పటి వరకూ కొనసాగిస్తారో.. ఎవరు అధిగమించి అధికారాన్ని చేపడతారో చూడాల్సి ఉంది.

# రెంట్ బాయ్‌ఫ్రెండ్‌తో జరాభద్రం

**హైదరాబాద్ :** సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్.. సోషల్ మీడియాలో జరుగుతున్న మరో మోసంపై యువతను అప్రమత్తం చేశారు. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో నెట్టింట జరుగుతున్న ప్రచారం వెనుక ఉన్న మోసాలను వివరిస్తూ అమ్మాయిలు, యువతులను అలర్ట్ చేశారు. ఆకర్షణీయమైన కుర్రాళ్ల ఫోటోలు పెట్టి, అమ్మాయిలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఇలాంటి కేటుగాళ్ల వలలో పడొద్దంటూ హెచ్చరించారు. ఇలాంటి మోసాలను గమనిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియాలో జరిగే మోసాల నుంచి సైబర్ నేరాల వరకూ ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్. ముఖ్యంగా యువతీ, యువకులు మోసాలకు గురికాకుండా సోషల్ మీడియా ద్వారావారిని అలర్ట్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే రెంట్ బాయ్‌ఫ్రెండ్ పేరుతో నెట్టింట జరుగుతున్న మోసాలపై మరోసారి యువతను అప్రమత్తం చేశారాయన. ఆగస్ట్ నెలలో రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు వల వేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. అలర్ట్‌గా ఉండాలని అమ్మాయిలకు సూచించారు.ఒంటరితనంతో బాధపడుతున్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అది కూడా 50 శాతం ఆఫర్లతో అంటూ సోషల్ మీడియాలో కలర్‌ఫుల్‌గా కనిపించే పోస్టర్ల వెనుక సైబర్ మోసం దాగి ఉందని.. అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు విసురుతున్న కొత్త డేటింగ్ ట్రాప్ ఇదంటూ సజ్జనార్ హెచ్చరించారు. ఫేస్ బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లోఆకర్షణీయంగా ఉండే అబ్బాయిల ఫోటోలను చూపిస్తూ.. కాఫీ మీటింగ్, సినిమా డేట్, షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లు, ఫుల్ డే ప్యాకేజీ అంటూ కేటుగాళ్లు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. గోప్యత, భద్రత పాటిస్తామని, అక్రమ వ్యాపారం కాదని నమ్మబలుకుతూ బుకింగ్స్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతూ నెట్టింట ప్రచారం చేస్తున్నారని సజ్జనార్ వివరించారు."ఏఐతో సృష్టించిన, ఇంటర్నెట్ నుంచి సేకరించిన అందమైన కుర్రాళ్ల ఫోటోలను ప్రొఫైల్ పిక్చర్లుగా పెట్టి, మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో సంభాషణలు మొదలుపెడతారు. బుకింగ్ కన్ఫర్మేషన్,



సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ అమౌంట్ పేరుతో డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసి, ఆపై అకౌంట్లను బ్లాక్ చేస్తారు. ఆన్‌లైన్ సంభాషణలు నమ్మి అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడానికి వెళ్తే వారు మిమ్మల్ని సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉంది. ప్రేమ పేరుతో అబద్ధాలు చెప్పి మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చాటింగ్ క్రమంలో చాకచక్యంగా సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత ఫోటోల ఆధారంగా ఆ తర్వాత బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది." అని సజ్జనార్ యువతులు, అమ్మాయిలను అప్రమత్తం చేశారు.సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ రకమైన మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం దృష్టిసారించిందని.. వీటికి బాధ్యులైన వారిపై వేగంగా దర్యాప్తు చేసి.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో అమ్మాయిలతో పాటుగా, వారి తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. తమ పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? బయట ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.సోషల్ మీడియాలో ఇలాంటి కేటుగాళ్లు ఇచ్చే డిస్కౌంట్ ఆఫర్లను చూసి మోసపోవద్దని.. అపరిచిత వ్యక్తులతో చాటింగ్, కలవడం కానీ చేయవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి సైబర్ కేటుగాళ్ల బారినపడినా, లేదా అనుమానాస్పద పోస్టులు గమనిస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కి కాల్ చేయాలని.. లేదంటే ఇ‌ఎవతీఇతీతిఎవ.ఐనీల.తిని పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు.

## వర్షాలు కురవాలి.. ప్రాజెక్టులు నిండాలి

-మొదటిపేజీ తరువాయి

మధ్యాహ్నం 3.15 గంటలకు యాగశాలలోకి వచ్చిన సీఎం దంపతులు..3:24 గంటలకు పూర్ణాహుతి సమర్పించారు. 'కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా పడాలి. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులతో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలి. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళను సంతరించుకోవాలి. భూగర్భ జలాలు పెరగాలి. పంటలు పుష్కలంగా పండాలి. రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలి.
రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలి. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలి..'అని ముఖ్యమంత్రి వరుణ దేవుడిని ప్రార్థించారు. భారతీయ సంస్కృతిలో వర్షాలు కురవాలని యాగాలు, యజ్ఞాలు, పూజలు నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయం. కాగా వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో ఈసారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ మహా వరుణయాగాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, పి.సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, నేనావత్ బాలునాయక్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**కృష్ణమ్మ ఒడ్డున మార్మోగిన వేదఘోష**

సూర్యకిరణాలు ఇంకా కృష్ణమ్మ జలాలను తాకకముందే.. నాగార్జునసాగర్ పరిసరాల్లో నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ సోమవారం తెల్లవారుజాము నుంచే వేద మంత్రాలు మార్మోగాయి. చతుర్వేద పారాయణంతో యాగ క్రతువు ప్రారంభమైంది. ప్రధాన యాగ క్రతువుల కోసం 32 మంది రుత్వికులు యాగశాలలో నిర్దేశించిన స్థానాల్లో ఆశీనులు కాగా, మిగిలిన రుత్వికులు నిరంతర వేద పారాయణం, జపంలో పాల్గొన్నారు. చతుర్వేద పారాయణం అనంతరం అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించారు. హోమకుండాల్లో పవిత్ర అగ్నిని ప్రజ్వలింపజేసి, వరుణ దేవుడిని ఆవాహన చేస్తూ హోమాలు నిర్వహించారు. ఆకాశం--జలం--భూమి--మానవాళి మధ్య సమతుల్యత నెలకొనాలని ఆకాంక్షిస్తూ వేద మంత్రాల నడుమ హోమ ద్రవ్యాలను అగ్నికి సమర్పించారు. ఒకవైపు కృష్ణమ్మ విశాల జలరాశి, మరోవైపు హోమకుండాల్లో ఎగసిపడుతున్న అగ్నిజ్వాలలు, వాటి మధ్య ప్రతిధ్వనించిన వేదఘోషతో సాగర్ తీరం భక్తిభావంతో నిండిపోయింది.

**వరుణారాధనతో విజయపురికి ప్రాచీన అనుబంధం**

మహా వరుణ యాగం నిర్వహిస్తున్న ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం కూడా ఉందని యాగ నిర్వాహకులు పేర్కొన్నారు. నేటి నాగార్జునసాగర్ ప్రాంతం ఒకనాటి విజయపురిగా ప్రసిద్ధి చెందిందని, ఈ ప్రాంతంలో ప్రాచీన కాలంలోనే వరుణారాధన జరిగినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని వేద పండితులు వివరించారు. వరుణుడితో సంబంధం ఉన్న ఒక ప్రాచీన ప్రతిమ ప్రస్తుతం నల్లగొండ మ్యూజియంలో భద్రపరచబడి ఉందని వారు పేర్కొన్నారు. ఈ చారిత్రక నేపథ్యం కారణంగా ప్రస్తుతం జరుగుతున్న మహా వరుణ యాగానికి మరింత ఆధ్యాత్మిక విశిష్టత చేకూరిందని తెలిపారు. శతాబ్దాల కిందట జలాల కోసం ఇదే నేలపై వినిపించిన వరుణ ప్రార్థన, ఇప్పుడు మరోసారి కృష్ణమ్మ ఒడ్డున వేదఘోషగా ప్రతిధ్వనిస్తోందన్న భావన యాగానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులు యాగ నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. ప్రధాన అర్చకులు ఆచార్య వెంకటాచార్యులు, నరేష్ శర్మ, వెంకట రామశర్మ, ఆదిత్య శర్మతో పాటు పలువురు వేదపండితులు యాగ క్రతువులను నిర్వహించారు. రోజంతా వరుణ యాగం కొనసాగగా, మధ్యాహ్నం 3.24 గంటలకు మహా పూర్ణాహుతితో ముగిసింది.

## 'ఉదాసీనంగా ఉన్న బీఎల్‌ఏలను తొలగించండి'

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ.. నేటితో మొదటి దశ పూర్తి అవుతుందని, మంగళవారం నుంచి సర్ రెండో దశ ప్రారంభం అవుతుందన్నారు. ఈ దశలోనే చాలా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ అయిందని, ఇక నుంచి అనమాలిస్ జాబితాలను జాగ్రత్తగా గమనించాలన్నారు. ఇదే చాలా కీలకమైన ఘట్టమని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న వర్గాల ఓట్లను జాబితా నుంచి తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. అర్హత కలిగిన వారు ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడాలన్నారు. బీఎల్‌ఏలు సరిగా పని చేయకపోతే పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయంలో చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించేది లేదని హెచ్చరించారు. సరిగా పని చేయని వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని ఆదేశించారు.

## ప్రాజెక్టులకు నిధుల కోసం..

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం 4.59 ఎకరాలు అమ్మకానికి సిద్ధంగా ఉంది. అలాగే గోల్డ్‌మైల్‌లో 0.70 ఎకరాలను విక్రయించనున్నారు. ఈ లే అవుట్‌లలోని భూములకు ఈ నెల 25న ప్రీబిడ్డింగ్ సమావేశం నిర్వహించి సెప్టెంబర్ 9వ తేదీన ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనున్నారు. బిడ్డింగ్‌లో పాల్గొనేవారు సెప్టెంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు.

**మోకిలాలో 35 ప్లాట్లు..**

కోకాపేట్, రాయదుర్గం, హైటెక్ సిటీ, మోకిలా, తదితర ప్రాంతాలు దిగ్గజ నిర్మాణ సంస్థలను, అంతర్జాతీయ వ్యాపారవర్గాలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ప్రాంతాల్లో భూముల అమ్మకాలకు మరోసారి పెద్ద ఎత్తున స్పందన లభించవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సినీ, వ్యాపార వర్గాలను ఎక్కువగా ఆకర్షిస్తున్న మోకిలాలో మరో 35 ప్లాట్లను విక్రయించేందుకు సెప్టెంబర్ 2వ తేదీన వేలం నిర్వహించనున్నారు. ఈ నెల 19న ప్రీబిడ్డింగ్ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. కనిష్టంగా 300 చ.గజాల నుంచి గరిష్టంగా 500 చ.గ.ల వరకు విస్తీర్ణం కలిగిన ప్లాట్లు వీటిల్లో ఉన్నాయి. గతంలో గజం రూ.లక్షకు పైగా ధర పలికిన దృష్ట్యా ఈసారి అంతకంటే ఎక్కువ మొత్తంలోనే డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతంగజానికి రూ.55 వేల చొప్పున కనీస ధరను నిర్ణయించారు.

**బాచుపల్లి స్థలాలకు మరోసారి వేలం**

బాచుపల్లిలో గతంలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు కొనుగోలుదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. దీంతో మరోసారి ఈ స్థలాలను వేలం వేయాలని నిర్ణయించారు. కనిష్టంగా 266 గజాల నుంచి గరిష్టంగా 499 గజాల వరకు మొత్తం 35 ప్లాట్లు ఉన్నాయి. ఈ స్థలాలకు రూ.45 వేల కనీస ధర నిర్ణయించారు. మోకిలా, బాచుపల్లి ప్లాట్లకు సెప్టెంబర్ 2వ తేదీన బిడ్డింగ్ నిర్వహించనున్నారు. మరోవైపు రంగారెడ్డి జిల్లాలోని కొత్తూరు, ఫరూక్‌నగర్ మండలాల్లో ఉన్న ఇన్ముల్ నెర్వా హెచ్‌ఎండీఏ లే అవుట్‌లో 60 ప్లాట్లను విక్రయించనున్నారు. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేవిధంగా ఇక్కడ గజానికి రూ.15 వేల చొప్పున కనీస ధరను నిర్ణయించారు. కనిష్టంగా 152 గజాల నుంచి గరిష్టంగా 300 గజాల విస్తీర్ణం వరకు ప్లాట్లు ఉన్నాయి. సెప్టెంబర్ 3వ తేదీన బిడ్డింగ్ నిర్వహించనున్నారు. ఈ ప్లాట్లకు ఈ నెల 22న ప్రీబిడ్డింగ్ ఉంటుందని అధికారులు తెలిపారు. కొనుగోలుదారులు సెప్టెంబర్ 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

**సరూర్‌నగర్ హాట్‌కేక్**

సరూర్‌నగర్‌లోని 4,355 గజాల స్థలానికి సెప్టెంబర్ 7వ తేదీన బిడ్డింగ్ ఉంటుంది. ఈ నెల 25న ప్రీబిడ్డింగ్ నిర్వహించనున్నారు. హెచ్‌ఎండీఏకు చెందిన ఈ స్థలం వ్యాపార, వాణిజ్య వర్గాలను, నిర్మాణ సంస్థలను ఆకట్టుకునే విధంగా ఉండడంతో గజానికి రూ.1,50,000 చొప్పున కనీస ధరను నిర్ణయించారు. అలాగే హైదర్‌నగర్‌లో మరో 3,454 గజాల స్థలాన్ని విక్రయించనున్నారు. ఇక్కడ గజానికి రూ.95 వేల చొప్పున కనీస ధర నిర్ణయించారు. ఈ స్థలాలతో పాటు గండిపేట్‌లోని బైరాగిగూడ (2,420 గజాలు), చందానగర్ (484 గజాలు), నార్సింగి (2,420 గజాలు), సూరారం (4,840 గజాలు) కాప్రా (484 గజాలు), అమీన్‌పూర్ ( 1,452 గజాలు)లోని భూ విభాగాలకు ఈ నెల 24న బిడ్డింగ్ నిర్వహించనున్నారు.

**ప్రాజెక్టులకు నిధుల కోసం..**

వివిధ ప్రాంతాల్లోని భూములు, ప్లాట్ల అమ్మకాల ద్వారా సుమారు రూ.3 వేల కోట్లకు పైగా లభించవచ్చునని అధికారుల అంచనా. ప్రస్తుతం జేబీఎస్--శామీర్‌పేట్, జేబీఎస్--డెయిరీ ఫామ్ ఎలివేటెడ్ కారిడార్‌లతో పాటు, రేడియల్ రోడ్లు, మెట్రో మొదటి దశ స్వాధీనానికి నిధుల సేకరణలో భాగంగా ఈ భూములను విక్రయించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఆగస్టు 2026

## సంపాదకీయం

# ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లులో బిగ్ ట్విస్ట్

భారతదేశంలో చట్టాలు రూపొందించడం, వాటిపై చర్చించడం పార్లమెంటు, రాజకీయ పార్టీల నేతల పరిధిలోనిదే. అభ్యంతరాలు ఉంటే అవి సభల్లోనే వ్యక్తం కావాలి. దీనికి విరుద్ధంగా విదేశీ నేతలు స్పందించడం అంతర్గత వ్యవహారాల్లో జోక్యంగా పరిగణించబడుతుంది. ఇటీవల ఎఫ్‌సీఆర్ఏ సంబంధిత బిల్లు విషయంలో ఇదే సూత్రాన్ని భారత్ స్పష్టం చేసింది. ఈ బిల్లు విదేశీ నిధుల రాకపోకలపై నియంత్రణను మరింత కఠినం చేసే దిశగా ఉంది. సంస్థలు నిధుల మూలాలు, ఖర్చుల వివరాలు స్పష్టంగా నివేదించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆస్తులు జప్తు చేసే అధికారం కేంద్రానికి ఉంటుంది. దీని ద్వారా అంతర్గత భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై నియంత్రణ సాధ్యమవుతుందని ప్రభుత్వ వైపు నుంచి వాదన ఉంది. రాజకీయ చర్చలు ఈ అంశం చుట్టూనే తిరగనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఈ బిల్లు ఆమోదంపై దృఢంగా ఉన్నారని సూచనలు వస్తున్నాయిఈ ప్రక్రియపై అమెరికా సెనేటర్ రైలీ మూర్ వ్యతిరేకత వ్యక్తం చేశారు. భారత్‌లో క్రైస్తవులు సెయింట్ థామస్ కాలం నుంచి ఉన్నారని, వేల సంవత్సరాల చరిత్ర ఉందని చెబుతూ, ఎఫ్‌సీఆర్ఏ ద్వారా వారిని నియంత్రించాలని ప్రయత్నం జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నంగా కనిపించాయి. అయితే అమెరికాలోనే అమలులో ఉన్న ఇలాంటి నియంత్రణల గురించి ఆయన ప్రస్తావించలేదు. భారత్ నుంచి అమెరికాలోని ఇస్కాన్ వంటి సంస్థలకు నిధులు వెళ్తే అవి అమెరికా నిబంధనలకు లోబడి లెక్కలు చూపాల్సి ఉంటుంది. ఇదే తరహా జవాబుదారీతనం భారత్‌లోనూ అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ బిల్లు వస్తోంది. విదేశీ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందించారు. ఇది పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని, బయటివారు స్పందించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇలాంటి స్పష్టత అమెరికాకు అసౌకర్యం కలిగించవచ్చు. యూరప్ నేతలు కూడా ఇలాంటి సందర్భాల్లో సాధారణంగా జాగ్రత్తగా ఉంటారు. అయినా భారత్ తన సార్వభౌమత్వాన్ని నొక్కి చెప్పింది. రైలీ మూర్ ట్రంప్‌కు సన్నిహితుడని, ఆయన ద్వారా సందేశం వస్తున్నట్లు కొందరు అంచనా వేస్తున్నా, అధికారికంగా ఇది ఒక సెనేటర్ వ్యక్తిగత అభిప్రాయంగానే చూడాలి. ప్రతి దేశం తన భద్రత, నిధుల పారదర్శకత కోసం చట్టాలు తీసుకురావడం సహజం. వివాదాస్పద విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు?2026పై కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. ఈ బిల్లును గత కాలానికి (రెట్రోస్పెక్టివ్‌గా) వర్తింపజేయబోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లు మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా వెల్లడించారు. మిజోరం చర్చి నాయకుల ప్రతినిధి బృందంతో కలిసి అమిత్ షాను కలిసిన అనంతరం ఆయన ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. ఈ బిల్లును ఆగస్టు 12న పార్లమెంట్‌లో చర్చించి ఆమోదానికి తీసుకురానున్నట్లు హోంమంత్రి వెల్లడించినట్లు చెప్పారు. ప్రతిపాదిత ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు విదేశీ నిధులు స్వీకరించే స్వచ్ఛంద సంస్థలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రద్దు అయిన, గడువు ముగిసిన లేదా స్వచ్ఛందంగా వదులుకున్న సంస్థలకు చెందిన విదేశీ నిధులు, వాటితో కొనుగోలు చేసిన ఆస్తులను ప్రభుత్వం నియమించే ప్రత్యేక అధికార సంస్థ ఆధీనంలోకి తీసుకునే విధంగా కొత్త నిబంధనలు తీసుకురావాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. అయితే ఈ చట్టాన్ని గతానికి వర్తింపజేస్తే నిజాయితీగా పనిచేస్తున్న సంస్థలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా, మిజోరం కోహ్రాన్ హ్రుయితు కమిటీ, మిజోరం చర్చిల మండలి ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పరిపాలనా లేదా సాంకేతిక లోపాల కారణంగా స్వచ్ఛంద సంస్థలు శిక్షార్హులుగా మారే అవకాశం ఉందని పేర్కొంటూ, ఈ చట్టాన్ని భావి కాలానికి మాత్రమే వర్తింపజేయాలని కేంద్రాన్ని కోరారు. దీనిపై స్పందించిన అమిత్ షా, బిల్లు గతానికి వర్తించదని హామీ ఇచ్చినట్లు లాల్దుహోమా తెలిపారు. ఇదే సమయంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభనను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసింది. కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుతో పాటు ఇతర చట్టాలపై చర్చ జరిగేలా ప్రతిపక్షాలతో సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ఫోన్‌లో మాట్లాడి సహకారం కోరారు. గత పది రోజుల్లో పలుమార్లు ఇరు నేతల మధ్య చర్చలు జరిగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ మాత్రం కీలక బిల్లులపై ముందుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. అయితే దీనిపై కేంద్రం ఇప్పటివరకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. మరోవైపు 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసే దిశగా రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రభుత్వం ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నాలు చేస్తోంది. అలాగే 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కు పెంచే డీలిమిటేషన్ ప్రతిపాదనపైనా రాజకీయ పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ కీలక బిల్లులపై ఆగస్టు 12న జరిగే పార్లమెంట్ చర్చ దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమెరికా తన భూభాగంలో విదేశీ నిధులపై నియంత్రణలు పెట్టుకుంటే, భారత్‌లోనూ అదే హక్కు ఉంది. ఒకవైపు స్వేచ్ఛ, మత స్వాతంత్ర్యం గురించి మాట్లాడుతూ, మరోవైపు మరొక దేశం యొక్క నియంత్రణ చర్యలను లక్ష్యంగా చేసుకోవడం ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తుంది. ఎఫ్‌సీఆర్ఏ కేవలం ఒక మతాన్ని లక్ష్యం చేసుకోవడం కాదు.. అన్ని సంస్థలకు వర్తించే సాధారణ నిబంధనలు. అంతర్గత శత్రువులు లేదా అపారదర్శక నిధుల మార్గాలను అడ్డుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం. మొత్తంగా చూస్తే, ఈ వివాదం భారత్ తన స్వాతంత్ర్యాన్ని, చట్టపరమైన సార్వభౌమత్వాన్ని ఎలా కాపాడుకుంటుందో చూపిస్తోంది. విదేశీ అభిప్రాయాలు ఉండవచ్చు, కానీ నిర్ణయాలు భారత ప్రజలు, వారి ప్రతినిధులు తీసుకోవాలి. ఎఫ్‌సీఆర్ఏ బిల్లు ఆమోదం పొందితే నిధుల పారదర్శకత పెరుగుతుంది.

# విజయ్ వర్సెస్ స్టాలిన్





**చెన్నై :** విజయ్ పిలిచారు.. స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు రాలేదు. అన్నాడీఎంకే కూడా దూరంగానే నిలిచింది. మరోవైపు కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, ఎండీఎంకేకు చెందిన ఎంపీలు మాత్రం విజయ్‌తో కలిసి కూర్చున్నారు. అంటే విజయ్ పిలుపును పూర్తిగా తిరస్కరించిన పరిస్థితి లేదు. అదే సమయంలో అన్ని పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావాలన్న లక్ష్యం కూడా పూర్తిగా నెరవేరలేదు. అందుకే ఈ సమావేశాన్ని విజయ్ విజయం అనీ.. వైఫల్యం అనీ ఒక్క మాటలో చెప్పలేం. అసలు డీలిమిటేషన్ అంటే నియోజకవర్గాల పునర్విభజన. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పునఃసర్దుబాటు చేస్తే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్నది తమిళనాడు పార్టీల ఆందోళన. కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణ వంటి అంశాల్లో ముందున్న రాష్ట్రాలకు.. తర్వాత పెరిగిన జనాభా ఆధారంగా రాజకీయ ప్రాతినిధ్యం తగ్గించడం న్యాయం కాదన్న వాదన చాలాకాలంగా ఉంది. అందుకే డీలిమిటేషన్ తమిళనాడులో కేవలం నియోజకవర్గాల లెక్క కాదు.. రాష్ట్ర హక్కుల అంశంగా మారింది. ఈ అంశంపై డీఎంకే ఇప్పటికే పోరాటం చేస్తోంది. స్టాలిన్ నేతృత్వంలో గతంలోనే అఖిలపక్ష సమావేశాలు కూడా జరిగాయి. తమిళనాడుకు అన్యాయం జరగకూడదన్న వాదనను డీఎంకే జాతీయ స్థాయిలో కూడా వినిపించింది. అంటే డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటం విజయ్‌తో మొదలైంది కాదు. మరి ఇప్పుడు విజయ్ అదే అంశంపై ప్రత్యేకంగా ఎంపీల సమావేశం ఎందుకు పెట్టారు? అన్నదే అసలు రాజకీయ ప్రశ్న. ఇక్కడే విజయ్ రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. ఒక సమస్యపై అన్ని పార్టీలను ఒకే టేబుల్ దగ్గరకు తీసుకురావడం ద్వారా తాను కేవలం ఒక పార్టీ అధినేతను కాదని.. తమిళనాడు ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని వెళ్లగల నాయకుడినననే ఇమేజ్‌ను నిర్మించుకోవాలని చూస్తున్నారా? అన్న చర్చ మొదలైంది. ఎందుకంటే ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓడించడం ఒక రాజకీయ విజయం. కానీ ప్రత్యర్థి పార్టీలతో కూడా ఒక రాష్ట్ర ప్రయోజనం కోసం మాట్లాడగల స్థాయిని చూపించడం మరో రకమైన నాయకత్వ పరీక్ష. అయితే ఈ సమావేశానికి స్టాలిన్ రాకపోవడమే ఇప్పుడు విజయ్‌కి అతిపెద్ద రాజకీయ ప్రశ్నగా మారింది. స్టాలిన్ వచ్చి ఉంటే కథ మరోలా ఉండేది. విజయ్ పిలుపునకు స్పందించి స్టాలిన్ కూడా అదే వేదికపై కూర్చుని తమిళనాడు హక్కుల కోసం కలిసి పోరాడతామని ప్రకటించి ఉంటే.. విజయ్ రాజకీయ ఇమేజ్‌కు అది భారీ బూస్ట్ అయ్యేది. తనకంటే సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న స్టాలిన్‌ను కూడా ఒక సమస్యపై తన వేదికపైకి తీసుకురాగలిగాడనే ప్రచారం జరిగేది. కానీ స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు కూడా రాలేదు. ఇది విజయ్‌కు ఒకవైపు ఎదురుదెబ్బే. కానీ రాజకీయంగా మరో అవకాశం కూడా. ఎందుకంటే ఇప్పుడు విజయ్ ప్రజల్లో ఒక ప్రశ్నను బలంగా తీసుకెళ్లవచ్చు. తమిళనాడు కోసం అందరినీ పిలిచాను.. కలిసి మాట్లాడుదామని చెప్పాను. ఎవరు వచ్చారు? ఎవరు రాలేదనేది మీరు చూశారని చెప్పొచ్చు. రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో ప్రత్యర్థి గైర్హాజరు కూడా ప్రచార ఆయుధంగా మారుతుంది. స్టాలిన్ విజయ్ వేదికపైకి వచ్చి ఉంటే.. విజయ్‌కి ఒక రోజు రాజకీయ మైలేజ్ వచ్చేది. రాకపోవడంతో.. విజయ్ దాన్ని ఒక నేరేటివ్‌గా మార్చుకునే అవకాశం వచ్చింది. అయితే ఇక్కడ మరో లెక్క ఉంది. తమిళనాడుకు చెందిన మొత్తం 57 మంది ఎంపీల్లో 20 మంది మాత్రమే సమావేశానికి రావడం అంటే దాదాపు 35 శాతం మంది మాత్రమే హాజరైనట్టే. మిగిలిన 37 మంది.. అంటే దాదాపు 65 శాతం మంది రాలేదు. కాబట్టి దీనిని అన్ని పార్టీల ఏకాభిప్రాయ సమావేశంగా చెప్పడం సాధ్యం కాదు. కానీ వచ్చిన 20 మంది వివిధ పార్టీలకు చెందినవారు కావడం మాత్రం విజయ్‌కు రాజకీయంగా ఉపయోగపడే అంశం. ముఖ్యంగా కాంగ్రెస్ రావడం.. డీఎంకే దూరంగా ఉండటం ఆసక్తికరమైన పరిణామం. డీఎంకేకు కాంగ్రెస్‌తో రాజకీయ సంబంధం ఉన్నప్పటికీ.. విజయ్ ఏర్పాటు చేసిన వేదికకు కాంగ్రెస్ ఎంపీలు రావడం ద్వారా డీలిమిటేషన్‌ను పార్టీ రాజకీయాలకు అతీతమైన అంశంగా చూడాలన్న వాదన బలపడింది. అయితే దీన్ని వెంటనే కాంగ్రెస్–డీఎంకే మధ్య విభేదాలకు సంకేతంగా చూడటం తొందరపాటే అవుతోంది. కానీ విజయ్ మాత్రం ఈ పరిణామాన్ని తన రాజకీయ ప్రయోజనానికి ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటివరకు తమిళ రాజకీయాల్లో ప్రధాన పోరు డీఎంకే వర్సెస్ అన్నాడీఎంకే. రెండు పెద్ద రాజకీయ ధృవాల చుట్టూనే ఎన్నికలు తిరిగేవి. ఇప్పుడు విజయ్ రంగంలోకి వచ్చారు. 2026 రాజకీయ సమీకరణాల్లో ఆయన ఎదుగుదలతో పాత లెక్కలకు కొత్త సవాలు ఎదురైంది. అందుకే డీలిమిటేషన్ వంటి రాష్ట్ర హక్కుల అంశం విజయ్‌కు కేవలం ఒక విధానపరమైన అంశం కాదు.. తన నాయకత్వాన్ని ప్రదర్శించుకునే రాజకీయ వేదిక కూడా. అయితే విజయ్ ముందున్న అసలు పరీక్ష ఇక్కడే ఉంది. ఒక సమావేశం పెట్టడం సులువు.. ఆ సమావేశాన్ని ఉద్యమంగా మార్చడం కష్టం. డీలిమిటేషన్‌పై నిజంగా పోరాడాలంటే పార్లమెంట్‌లో ఎంపీలను సమన్వయం చేయాలి. దక్షిణాది రాష్ట్రాలతో కలిసి వెళ్లాలి. కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. కేవలం తమిళనాడు ఎన్నికల రాజకీయాలకు పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. అప్పుడు మాత్రమే విజయ్ "తమిళ హక్కుల కోసం అందరినీ కలిపే నాయకుడు" అనే ఇమేజ్ బలపడుతుంది. లేకపోతే డీఎంకే నుంచి మరో కౌంటర్ రావచ్చు. డీలిమిటేషన్‌పై మేము ఎప్పటి నుంచో పోరాడుతున్నాం. కొత్తగా విజయ్ వచ్చి మీటింగ్ పెట్టడం వల్ల ఇది కొత్త పోరాటం కాదని చెప్పే వీలుంది. అదే విజయ్‌కు పెద్ద సవాలు. ఎందుకంటే డీలిమిటేషన్ అనే అంశంపై స్టాలిన్‌కు రాజకీయ చరిత్ర ఉంది. విజయ్‌కు మాత్రం ఈ అంశంపై రాజకీయంగా కొత్త అధ్యాయం మొదలవుతోంది. అందుకే ఈ సమావేశానికి కేవలం "20 మంది ఎంపీలు వచ్చారు.. 37 మంది రాలేదు" అనే అంకెలతో చూడటం సరిపోదు. అసలు కథ.. ఎవరు వచ్చారు, ఎవరు రాలేదు.. ఎందుకు రాలేదు.. విజయ్ ఈ వేదికను తర్వాత ఎలా ఉపయోగించబోతున్నారు అన్నదే. స్టాలిన్ రాలేదు కాబట్టి విజయ్ ఓడిపోయారని చెప్పలేం. 20 మంది వచ్చారు కాబట్టి విజయ్ గెలిచారని కూడా చెప్పలేం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. డీలిమిటేషన్ పోరాటం పాతదే.. దానిపై విజయ్ వేసిన రాజకీయ అడుగు మాత్రం కొత్తది. స్టాలిన్ దగ్గర ఈ అంశంపై అనుభవం ఉంది. విజయ్ దగ్గర కొత్త రాజకీయ ఉత్సాహం ఉంది. ఒకరి దగ్గర పోరాట చరిత్ర ఉంటే.. మరొకరు దానికి కొత్త రాజకీయ వేదికను నిర్మించాలనుకుంటున్నారు. అందుకే విజయ్ పిలుపు.. స్టాలిన్ దూరం అనేది కేవలం ఒక సమావేశం కథ కాదు. తమిళనాడు హక్కుల పేరుతో మొదలైన ఈ పోరు.. రేపటి తమిళ రాజకీయాల్లో నాయకత్వ పోరుగా మారుతుందా? డీలిమిటేషన్ సీట్లను మారుస్తుందో లేదో వేచి చూడాలి.

# రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. వయా పాకిస్థాన్..!

**న్యూఢిల్లీ :** రష్యా నుంచి భారత్‌కు రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆ దేశ ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ప్రతిపాదించారు. ఈ మార్గం తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా సాగి హిందూ మహాసముద్రానికి చేరుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో అనుసంధానమయ్యే ఏ మార్గమైనా పరిశీలించేందుకు అనుకూలమేనని స్పష్టం చేశారు. బోస్ఫరస్, హర్మూజ్ జలసంధుల వద్ద ఎదురయ్యే భద్రతా, వాణిజ్యపరమైన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ భూభాగ మార్గాల అవసరం పెరుగుతోందని రష్యా భావిస్తోంది. రష్యా నుంచి భారత్‌కు రైలులో సరుకు రవాణా చేసే మార్గం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని కీలక సముద్ర వాణిజ్య మార్గాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో.. సముద్ర మార్గాలకు ప్రత్యామ్నాయంగా భారీ రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేసే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తోంది. రష్యా ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ఈ ప్రతిపాదనను ప్రస్తావించారు. రష్యా నుంచి హిందూ మహాసముద్రం వరకు రైల్వే లింక్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆయన సూచించారు. తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా ఈ రైల్వే మార్గాన్ని తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్‌కు చేరుకునే అవకాశం కల్పించే ఏ రూట్ అయినా తమకు పరిశీలనీయమేనని పేర్కొన్నారు. బోస్ఫరస్, హోర్మూజ్ జలసంధులపై ఆధారపడే అంతర్జాతీయ వాణిజ్య మార్గాలకు భద్రతాపరమైన ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో రష్యా ఈ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు నాలుగో వంతు, ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాల్లో దాదాపు ఐదో వంతు ఈ ప్రాంతం గుండా సాగుతుందని అంచనా. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు పెరగడంతో హర్మూజ్ జలసంధి ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో సముద్ర మార్గాల్లో అంతరాయాలు ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు అవసరమని రష్యా భావిస్తోంది. రష్యా ప్రతిపాదనల ప్రకారం సాధ్యమైన రైల్వే కారిడార్ తుర్క్‌మెనిస్తాన్ నుంచి ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా హిందూ మహాసముద్రంకు చేరేలా ఉండనుంది. ఈ మార్గం పూర్తిగా అమలులోకి వస్తే రష్యాకు సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని కొంత మేర తగ్గించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా భారత్‌తో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ తరహా భూభాగ రవాణా మార్గం ఉపయోగపడే అవకాశం ఉందని రష్యా భావిస్తోంది. అయితే ప్రతిపాదిత మార్గంలో ఉన్న దేశాల భౌగోళిక, భద్రతా, రాజకీయ పరిస్థితులు, మౌలిక వసతులు వంటి అనేక అంశాలు ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను ప్రభావితం చేయనున్నాయి. రష్యా చేస్తున్న ప్రతిపాదనలో భారత్‌కు అనుసంధానం కల్పించే మార్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం కనిపిస్తోంది. భారత్‌కు చేరుకునే అవకాశం ఉన్న ఏ రూట్ అయినా పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా ఉప ప్రధాని పేర్కొనడం దీనికి సంకేతంగా భావిస్తున్నారు. ఇలాంటి రైల్వే కారిడార్ అందుబాటులోకి వస్తే రష్యా–భారత్ మధ్య సరుకు రవాణాకు కొత్త మార్గం ఏర్పడే అవకాశం ఉంటుంది. సముద్ర రవాణాలో అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో ప్రత్యామ్నాయ మార్గంగా ఇది ఉపయోగపడవచ్చు. అయితే ఇది ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. మార్గం ఖరారు, నిర్మాణ వ్యయం, దేశాల మధ్య ఒప్పందాలు, భద్రతా అంశాలు వంటి అనేక దశలను దాటాల్సి ఉంటుంది. మొత్తంగా చూస్తే.. సముద్ర వాణిజ్య మార్గాల్లో పెరుగుతున్న భద్రతా సవాళ్లకు ప్రత్యామ్నాయంగా రష్యా భూభాగ రవాణా మార్గాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.

# బీజేపీతో మళ్లీ పొత్తుకు శిరోమణి అకాలీదళ్ పార్టీ ప్రయత్నాలు

**ఛండీఘడ్ :** ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంలోని మోదీ సర్కారు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటుచేసి, నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చింది. అయితే, ఈ రాజ్యాంగ సవరణ బిల్లు మూడింట రెండొంతుల మెజార్టీ సాధించలేక వీగిపోయింది. దీంతో మరోసారి ఈ బిల్లును తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మద్దతు కూడగట్టి, ఎలాగైనా గట్టిక్కించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే బిల్లుకు తాజాగా ఎస్ఏడీ మద్దతు ప్రకటించింది. బీజేపీ, అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తుందనే ఊహాగానాల నడుమ కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పంజాబ్‌కు చెందిన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాలీదళ్ బహిరంగంగా మద్దతు ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ భేటీ అయిన మర్నాడే ఈ ప్రకటన వెలువడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. అకాలీదళ్.. బీజేపీ కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని ఈ నిర్ణయం స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ప్రణాళికను సమర్థిస్తూ.. దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని బాదల్ శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో స్థానాలను సమానంగా 50 శాతం పెంచాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎస్ఏడీ మద్దతు ఇస్తుందని తెలిపారు. "చండీగఢ్‌లో జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశాం.. మహిళల గౌరవం, సమానత్వం, సమాన హక్కుల కోసం పోరాడిన సిక్కు గురువుల బోధనల నుంచి శిరోమణి అకాలీదళ్ స్ఫూర్తి పొందుతుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఇప్పటికే తన సభలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆదర్శంగా నిలిచింది. పార్లమెంట్ ముందుకు వచ్చిన కీలక అంశాలపై చర్చించిన అనంతరం, అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా న్యాయమైన డిలిమిటేషన్ జరగాలని భావిస్తున్నాం. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'అన్ని రాష్ట్రాల్లో 50% స్థానాల సమాన పెంపు' ప్రతిపాదనకు మేము మద్దతు ఇస్తున్నాం' అని బాదల్ వెల్లడించారు. ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో డిలిమిటేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టినప్పుడు అకాలీదళ్ దానిని తీవ్రంగా వ్యతిరేకించి, ప్రతిపక్షాలతో కలిసి వ్యతిరేకంగా ఓటు వేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పంజాబ్‌కు తక్కువ స్థానాలు పెరుగుతాయని, ఇది పంజాబ్‌కు వివక్షపూరితమైనదని అప్పట్లో పేర్కొంది. కానీ, ఇప్పుడు పొత్తు చర్చలు వేగం పుంజుకోవడంతో 50% స్థానాల పెంపు హామీతో ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. 2020లో వివాదాస్పద వ్యవసాయ చట్టాలతో బీజేపీ, అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాల బంధం తెగిపోయింది. ఆ సమయంలో ఎన్డీయే కూటమి నుంచి అకాలీదళ్ బయటకు వచ్చింది. ఆ తర్వాత 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీలు ఒంటరిగానే పోటీ చేశాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది. పార్లమెంట్‌లో ప్రధానితో బాదల్ శుక్రవారం భేటీ కావడంతో కూటమి పునరుద్ధరణపై ప్రచారం మొదలైంది. పంజాబ్ బీజేపీ వర్గాలు, ఎస్ఏడి, ఆర్ఎస్ఎస్‌లతో పాటు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన నేతలు కూడా పొత్తుకు అనుకూలంగా ఉన్నారు. దీనిపై బీజేపీ కేంద్ర నాయకత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గతంలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషించగా.. బీజేపీ చిన్న భాగస్వామిగా ఉండేది. కానీ, ఈసారి సమాన ప్రాతిపదికన పొత్తు ఉండాలని బీజేపీ కోరుతున్నట్లు సమాచారం. సీట్ల సర్దుబాటు వంటి వివరాలను తర్వాత చర్చించవచ్చని, పంజాబ్ పరిస్థితులను మెరుగుపరచడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యత అని అకాలీదళ్ నేతలు చెబుతున్నారు

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఆగస్టు 2026

# తెలంగాణ రోసం పోరాడిన నిస్వార్థ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి

## పెద్ది జ్ఞాపకాలు మన గుండెల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటాయి : హరీష్ రావు



**నర్సంపేట** నల్లబెల్లిలో జరిగిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కర్మ, సంస్మరణ సభ బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి తో నాకు రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఉంది. కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఆయనతో కలిసి అనేక పోరాటాల్లో, ఉద్యమాల్లో, ఉపఎన్నికల్లో నేను పనిచేశానని అన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు, ఆస్తులు, పదవులు ఏవీ లెక్కచేయకుండా పోరాడిన నిస్వార్థ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. మానుకోట సంఘటన అయినా, పరకాల, స్టేషన్ ఘనపూర్ ఉపఎన్నికలైనా.. ప్రతి చోటా పెద్ది సుదర్శన్ రెడ్డి పోరాట స్ఫూర్తి, ఆయన కష్టం ముందుండేది. సమైక్యవాదులు తెలంగాణ గడ్డ మీద అడుగుపెడుతుంటే.. వారి బుల్లెట్లను, రాళ్లను సైతం లెక్కచేయకుండా ముందుండి అడ్డుకున్న పోరాట యోధుడు పెద్ది. తెలంగాణ వచ్చే వరకు రాష్ట్ర సాధన కోసం పోరాడాడు. రాష్ట్రం వచ్చాక నర్సంపేట అభివృద్ధి కోసం ఎంతో తపన పడ్డాడు. ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ, ఆయన పోరాట స్ఫూర్తిని గుర్తించిన కేసీఆర్ .. క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్గా అవకాశం కల్పించారని అన్నారు. రామప్ప, పాకాల, లక్నవరం చెరువులకు దేవాదుల నీళ్లను అందించాలని కేసీఆర్ ని కోరి సాధించాడు. ఆయన అభ్యర్థన మేరకే కేసీఆర్ ఆనాడు దేవాదుల నీటిని విడుదల చేశారు. ఆ చెరువులకు దేవాదుల నీళ్లు వస్తున్నాయంటే అది ముమ్మాటికీ పెద్ది సుదర్శన్ రెడ్డి కృషే. తన ప్రాంత రైతులు రెండు పంటలు పండించుకోవాలని రాత్రింబవళ్లు తండ్లాడిండు. కేసీఆర్ ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను అందించాడు. రాష్ట్రంలో జిల్లా కేంద్రం కాని చోట మెడికల్ కాలేజీ సాధించిన ఏకైక నియోజకవర్గం నర్సంపేట. కేసీఆర్ ఆలోచనతో పాటు, ఈ ప్రాంతం మీద పెద్ది సుదర్శన్ రెడ్డికి ఉన్న ప్రేమ వల్లే ఇది సాధ్యమైంది. కాకతీయ రెడ్డి రాజులు కట్టిన దేవాలయం కూల్చివేతకు వ్యతిరేకంగా చేసిన నిరసనే నేను, పెద్ది కలిసి చేసిన చివరి కార్యక్రమం. అదే మా ఇద్దరి కలయికలో చివరిది అవుతుందని నేను కలలో కూడా అనుకోలేదు. ఒక చిన్న రైతు కుటుంబంలో పుట్టి, పోరాటాల ద్వారా ఎదిగిన నాయకుడు సుదర్శన్ రెడ్డి. ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, సివిల్ సప్లైస్ ఛైర్మన్గా, ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ కుటుంబ సభ్యుడిగా ఆయన గురించి ఎంత చెప్పుకున్నా, ఎంత మాట్లాడుకున్నా తక్కువే.గతంలో మేమిద్దరం బియ్యాల జనార్దన్ ఇంట్లో కిరాయికి ఉండేవాళ్లం. నేను, పెద్ది దాదాపు నెల, 40 రోజుల పాటు ఆ ఇంట్లో కలిసి ఉన్నాం. పరకాల, ఘనపూర్ ఉపఎన్నికల సమయంలో బాధ్యతలను భుజాన వేసుకుని పార్టీని గెలిపించుకున్నాం. అప్పుడు ఆయనకు అన్నం, నిద్ర, ఆకలి అనేవే ఉండేవి కావు. మాకు తెలంగాణ కావాలి, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించుకోవాలని ప్రతిక్షణం తపనపడ్డ గొప్ప ఉద్యమకారుడు ఆయన. అలాంటి నాయకుడిని కోల్పోవడం కేవలం నర్సంపేటకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకే కాదు.. యావత్ తెలంగాణ రాష్ట్రానికి, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు. పెద్ది సుదర్శన్ రెడ్డి లేని మీటింగ్లో, అది కూడా నర్సంపేట గడ్డ మీద నేను పాల్గొంటానని ఎప్పుడూ ఊహించలేదు. ఉద్యమ సమయంలో ఒక అమరవీరుని అంతిమ యాత్రలో పాల్గొంటున్నప్పుడు.. పోలీసులతో జరిగిన తోపులాటలో నేను డీసీఎం పైనుంచి కింద పడిపోయాను. అప్పుడు నన్ను పెద్ది సుదర్శన్ రెడ్డి ఏ ఆసుపత్రిలో అయితే చేర్పించి ప్రాణాలు కాపాడాడో.. అదే ఆసుపత్రిలో ఆయనను నేను చివరిచూపు చూడాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదని అన్నారు.

(ఈ విషయాన్ని చెబుతూ హరీశ్ రావు తీవ్ర భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు). కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను భయపెట్టినా, ప్రలోభపెట్టినా, ఎన్ని రకాలుగా ఒత్తిడి చేసినా ఆయన తలొగ్గలేదు. ప్రభుత్వ అక్రమాల మీద అదే పాత ఉద్యమ స్ఫూర్తితో చివరి శ్వాస దాకా కొట్లాడిండు. భౌతికంగా సుదర్శన్ రెడ్డి మన మధ్య లేకపోయినా.. ఆయన చేసిన పోరాటం, ప్రజల కోసం పడ్డ తపన, ఆయన జ్ఞాపకాలు మన గుండెల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటాయని అన్నారు.

# కమలాపూర్ మండలంలో డబల్ బెడ్రూంలు కట్టింది కేసీఆర్

**ఈరోజు మీరు ప్రారంభించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేసీఆర్ కట్టించినవే**

**అబద్ధాలు చెబితే ఊరుకునేది లేదు.. నిజాలు మాట్లాడాలి, రాజకీయాలు చేయొద్దు**

**ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**కమలాపూర్లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విజ్ఞప్తి**



**కమలాపూర్ :** కమలాపూర్ మండలంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గారు మాట్లాడుతున్న సమయంలో రాజకీయ విమర్శలు, వాస్తవాలకు విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడంపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. "అబద్ధాలు చెప్పొద్దు.. నిజాలు మాట్లాడాలి. ఇది రాజకీయాలు చేయాల్సిన వేదిక కాదు. ప్రజలకు వాస్తవాలు చెప్పండి" అని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం కంటే, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**డబుల్ బెడ్రూమ్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి**

కేసీఆర్ గారు నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ప్రారంభించడానికి వచ్చిన మంత్రులు.. కేవలం ప్రారంభోత్సవం చేసి వెళ్లకుండా, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిష్కరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్, రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా కొన్ని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకుండా మిగిలిపోయాయని, వాటికి అవసరమైన నిధులు కేటాయించి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. చిన్నచిన్న నిర్మాణ పనులు, మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన ఆర్థిక సహాయం కూడా అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం డబుల్ బెడ్రూమ్ ఇళు అందుకున్న లబ్ధిదారులకు ఇళ్లలో అవసరమైన చిన్నచిన్న పనులు చేసుకునేందుకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఇదే వేదిక నుంచి మంత్రులను ఎమ్మెల్యే కోరారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, ఆడపిల్లల వివాహాలకు కళ్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, పెన్షన్ల పెంపు వంటి హామీలను ఏమయ్యాయని ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఉప్పల్ మరియు చల్లూరు మండలంగా ఏర్పాటు చేయాలి కమలాపూర్ మండలంలోని ఉప్పల్ ని వీణవంక మండలం లో చల్లూరు ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉప్పల్ ప్రాంతంలో దాదాపు 8 వేల మంది జనాభా ఉందని, మండలంగా ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని రవాణా శాఖ మంత్రిగా ఉన్నారు. కమలాపూర్ బస్టాండుకు రూ.2 కోట్లు కేటాయించాలి. కమలాపూర్ బస్టాండ్ నిర్మాణం కూడా పూర్తికాకుండా ఉందని ఎమ్మెల్యే తెలిపారు

# బీసీల సెంట్రిక్గా కవిత



**హైదరాబాద్ :** తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్న మాజీ ఎంపీ, మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత.. ఇప్పుడు వ్యూహం మార్చుకున్నట్టు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు తెలంగాణ సెంటిమెంటు, ఉద్యమ కారులు.. వారి హక్కులు, ఉద్యోగాలు అంటూ.. రాజకీయ నినాదాలు చేసిన కవిత.. వీటి వల్ల వర్కవుట్ కాదని అర్థం చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె.. తన పంథాను సమూలంగా మార్చుకు న్నట్టు కనిపిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణలో బీసీ సామాజిక వర్గం అధికారిక లెక్కల ప్రకారం.. 43 శాతం మంది ఉన్నారు. అనధికారికంగా 50 శాతం వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీలను తనవైపు తిప్పుకునే దిశగా కవిత రాజకీయాలకు పదును పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీ ఓటు బ్యాంకు నికరంగా ఎవరికీ ఎడాప్ట్ కాలేదు. బీఆర్ఎస్ అయినా.. బీసీ గణనను తొలిసారి నిర్వహించామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకైనా బీసీలు పూర్తిగా అంకితం కాలేదు. ఈ నేపథ్యంలో వారిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు కవిత ప్రయత్నం చేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే బీసీల హక్కుల సాధన, ఏపీలో చేస్తున్న బీసీల రక్షణ హక్కు చట్టం తరహాలో తెలంగాణలోనూ బీసీలకు రక్షణ హక్కు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు.. రాజకీయంగా అదేవిధంగా రాజ్యాంగ పరంగా కూడా.. బీసీలకు 50 శాతం పదవులు కేటాయించాలని కోరుతున్నారు. వాస్తవానికి కవిత బీసీ కాకపోయినా.. ఆ వర్గాన్ని తనదైన శైలిలో తనవైపు తిప్పుకొనేందుకు బీసీల సమస్యలను భుజాని వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం నినాదాలకే పరిమితం కారాదని కూడా కవిత నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.బీసీల కోసం ఉద్యమం చేయాలనే దిశగా కవిత ఆలోచన చేస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంటు నుంచే ఆమె పని ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించిన తరహాలో బీసీల కోసం.. వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించి.. ఢిల్లీ నుంచే తన వ్యూహాన్ని పెంచాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కార్యాచరణపై ప్రస్తుతం కవిత కసరత్తు చేస్తున్నారు. ఇది అయిన తర్వాత.. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కోసం ఉద్యమం నిర్మించి.. జిల్లాల వారీగా పర్యటనలు చేయాలనినిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇది ఏమేరకు వర్కువుట్ అవుతుందో చూడాలి.

## నేతన్నల సేవలో మంత్రి సవిత పథకంపై సమీక్ష

**అమరావతి** రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులతో కలిసి అలాగే ప్రతి జిల్లా చేనేత అధికారులతో మంత్రి సవిత జూమ్ మీటింగ్ ద్వారా 'నేతన్నల సేవలో' పథకంపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రారంభించిన 'నేతన్నల సేవలో' పథకం ద్వారా రాష్ట్రంలోని చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. ఇప్పటికే 71,536 మంది నేతన్నలకు ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందించామని మంత్రి అన్నారు. ఇంకా మిగిలిపోయిన అర్హులైన నేతన్నలకు కూడా వారం రోజుల్లో రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. 'నేతన్నల సేవలో' పథకానికి 13,678 మంది దరఖాస్తు చేసుకోగా, అర్హులను గుర్తించి వారికి కూడా నేతన్నల నేస్తం పథకం వర్తింపజేస్తాం. 50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నాం. 62,541 మంది నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి నేతన్నకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం. ఆ దిశగా ఎలాంటి అర్హుడు మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి కేటీఆర్ నివాళి

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు" అని వ్యాఖ్యానించారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి, జులై 31న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్గా సేవలందించడంతో పాటు, 2018-2023 మధ్య కాలంలో నర్సంపేట ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు.కాగా, నిన్న ఆదివారం నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో పార్టీ తరఫున ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ. 25 లక్షలను కేటాయించారు.

## మెడికో ప్రియాంక మృతి..

**నిందితులను కఠినంగా శిక్షించాలన్న తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్లోని రాజమహేంద్రవరంలో గత వారం మాల్ వద్ద కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన తెలంగాణ మెడికో కె. ప్రియాంక (28) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఇవాళ పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, గాంధీ ఆసుపత్రికి వెళ్లి ప్రియాంక కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూసేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడతారని ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా, ఏక్లాస్పూర్ గ్రామానికి చెందిన ప్రియాంక, రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఎండీ చదువుతున్నారు. ఈ నెల 3వ తేదీ రాత్రి, తన స్నేహితుడు ఉమేశ్తో కలిసి స్కూటీపై మాల్ నుంచి బయటకు వస్తుండగా ఈ ఘోరం జరిగింది. మద్యం మత్తులో ఉన్న సురవరపు దశవంత్, ఆండ్రూ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు వ్యక్తులు మాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో వారితో గొడవపడి, దాడి చేసి, అక్కడి నుంచి కారులో వేగంగా పారిపోయే ప్రయత్నంలో మాల్ గేటు వద్ద ఉన్న ప్రియాంక స్కూటీని మూడుసార్లు ఢీకొట్టారు.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రియాంకను మొదట స్థానిక ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమెను వైద్యులు బ్రెయిన్ డెడ్గా ప్రకటించగా, నిన్న తుదిశ్వాస విడిచారు. ఆమె మృతదేహానికి గాంధీ ఆసుపత్రిలో పోస్ట్మార్టం నిర్వహించి, అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించనున్నారు.ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి, ప్రియాంక కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. మొదట నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రియాంక మరణంతో ఇప్పుడు ఆ సెక్షన్ను హత్యా నేరంగా మార్చే అవకాశం ఉంది. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ప్రియాంక తండ్రి వెంకటేశ్ రాజమహేంద్రవరంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడితే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని మంత్రి శ్రీహరి అభిప్రాయపడ్డారు. ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు

## హైదరాబాద్ వాసులకు గుడ్న్యూస్:

## సులభం కానున్న బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ

**హైదరాబాద్ :** జనన, మరణ ధ్రువపత్రాల జారీలో జాప్యాన్ని నివారించి, ఆ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సిద్ధమవుతోంది. నగరవాసుల సౌకర్యార్థం 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' (సీఆర్ఎస్) పేరుతో సరికొత్త ఆన్లైన్ పోర్టల్ను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తోంది. దీని ద్వారా ప్రజలు ఆన్లైన్లోనే జనన, మరణాలను సులువుగా నమోదు చేసుకుని, వేగంగా ధ్రువపత్రాలను పొందే వీలుంటుంది.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇటీవల అధికారులతో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. జనన, మరణాల నమోదు, సకాలంలో ధ్రువపత్రాల జారీ అనేది జీహెచ్ఎంసీ ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే కొత్త పోర్టల్ పనితీరుతో పాటు జనన, మరణాల నమోదు చట్టంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నూతన డిజిటల్ ప్లాట్ఫామ్ ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల పార్లమెంట్ ఆమోదించి, రాష్ట్రపతి సంతకంతో అమల్లోకి వచ్చిన జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం-2026 నేపథ్యంలో జీహెచ్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. నూతన చట్టం ప్రకారం, జనన లేదా మరణాల నమోదులో జాప్యం జరిగితే కఠినమైన నిబంధనలు వర్తిస్తాయి.ఒకటి నుంచి రెండేళ్లలోపు జాప్యం జరిగితే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటితే మాత్రం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నుంచి మాత్రమే ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది. ఈ కఠిన నిబంధనల దృష్ట్యా, పౌరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడటంలో జీహెచ్ఎంసీ ప్రవేశపెట్టనున్న 'సీఆర్ఎస్' పోర్టల్ కీలక పాత్ర పోషించనుంది.

## భూ కబ్జాదారుల పెత్తనానికి చరమగీతం

**విజయవాడ :** రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలకు, గంజాయి బ్యాచ్ల ఆగడాలకు శాశ్వతంగా చరమగీతం పాడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తుంటే, ప్రతిపక్ష వైసీపీ మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. సోమవారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో నిర్వహించిన భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు.ప్రతి నెల 9వ తేదీన భూ సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించి, నేరుగా ప్రజల వద్దకే వచ్చి పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.

నవగీతం తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఆగస్టు 2026

## వేములవాడ భీమన్నను దర్శించుకున్న ప్రముఖ గాయని సత్యవతి రాథోడ్ (మంగ్లీ).

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆలయ అర్చకుల ఆశీర్వచనం.




**వేములవాడ,ఆగస్టు10,(నవగీతం)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ప్రముఖ గాయని సత్యవతి రాథోడ్ (మంగ్లీ) దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు మంగ్లీకి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ స్వామివారి, అమ్మవార్ల శేష వస్త్రంతో పాటు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.
ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకులు పేరుక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికుల నిరసన



**మెట్ పల్లి,ఆగస్టు10,(నవగీతం)** మెట్ పల్లి లోని మున్సిపల్ కార్యాలయం ముందు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కనీస వేతనాలు పెంచాలని నిరసన తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండి ఉస్మాన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేలుగా అమలు చేసి జీవో ఎంఎస్ నెంబర్ 14 ప్రకారం వేతనాలు అమలు చేయాలి తేదీ 11/ 6 /2021 జీవో ప్రకారం గత ప్రభుత్వం అన్ స్కిల్డ్ కార్మికులకు రూ: 16,600 స్కిల్డ్ కార్మికులకు రూ: 20,500 హైస్కిల్డ్ కార్మికులకు రూ: 22,750 నిర్ణయించడం జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేతనాలు తగ్గిస్తూ జీవో ఆర్ట్ నెంబర్ 1181 నీ 12/ 7 /2026 రోజున విడుదల చేశారు ఏ కార్మిక చట్టంలో కూడా వేతనాలు తగ్గించాలని లేదు వెంటనే జీవో నెం:1181 నీ ఉపసంహరించుకొని కార్మికులకు తగ్గించిన వేతనాని యధావిధిగా పాత పద్ధతిగానే అమలు చేయాలి  కార్మికులందరికీ శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలి అని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు లంక శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు బర్ల లక్ష్మణ్, యమ నరసయ్య, మధురమ్మ ,లక్ష్మి, బర్ల నరసయ్య, వాజిద్, గంగాధర్, నిజాం తదితర కార్మికులు పాల్గొన్నారు

## ఆషాఢం సందర్భంగా ఘనంగా గోరింటాకు కార్యక్రమం






**జగిత్యాల,ఆగస్టు10,(నవగీతం):** జగిత్యాల పట్టణంలోని వాణి నగర్ ఏరియాలో రమ్యనగేంద్ర ఇమిటేషన్ వారి ఆధ్వర్యంలో ఆడపడుచుల ఆషాఢం పండుగ సందర్భంగా "అరచేత గోరింటాకు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని మహిళలు, ఆడపడుచులతో కలిసి గోరింటాకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆషాఢ మాసంలో మహిళలు, ఆడపడుచులు కలిసి గోరింటాకు పెట్టుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక ప్రత్యేకమైన ఆచారమని, ఇలాంటి కార్యక్రమాలు మహిళల్లో ఆత్మీయతను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోరింటాకు పెట్టుకుంటూ ఉత్సాహంగా సందడి చేశారు. వాణి నగర్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమాన్ని నిర్వహించిన రమ్యనగేంద్ర ఇమిటేషన్ నిర్వాహకులను అడువాల జ్యోతి లక్ష్మణ్ అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న టౌన్ ఎస్ఐ సుప్రియ, డాక్టర్స్ మృదుల రెడ్డి, రోజా, శ్రీలత, నాగరత్న, మున్సిపల్ కో ఆప్షన్ వీరబత్తిని పద్మజ, మాజీ కౌన్సిలర్ మేక పద్మావతి మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## జగిత్యాల జిల్లా ఉపసర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా చెట్పల్లి ప్రసాద్



**కోరుట్ల/ కథలాపూర్,(నవగీతం)జగిత్యాల** జిల్లా ఉపసర్పంచుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన ఉపసర్పంచ్ చెట్‌పల్లి ప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ సోమవారం ఆయనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చెట్‌పల్లి ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఉపసర్పంచుల ఐక్యత కోసం కృషి చేయడంతో పాటు, ఉపసర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర స్థాయిలో పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉపసర్పంచుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముత్యాల స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గనవేణి నందిని మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి మెరుగు జంపన్న, కథలాపూర్ మండల అధ్యక్షుడు అన్నారపు నర్సయ్యతో పాటు వివిధ గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కొడిమ్యాల,ఆగస్టు.10.(నవగీతం)** ప్రజా ప్రభుత్వంలో ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యత తీసుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ఔదరి లక్ష్మికి మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాలతో మంజూరు ప్రక్రియలో ఆలస్యం జరిగింది. ఈ విషయంపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయించారు. అనంతరం లబ్ధిదారురాలి ఇంటికి స్వయంగా వెళ్లి ఇంటి మంజూరు ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మొదటి విడతలో కొడిమ్యాల మండలానికి 450 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని,రెండో విడతలో మరిన్ని ఇళ్లను త్వరలో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రానున్న మూడేళ్లలో చొప్పదండి నియోజకవర్గాన్ని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఇల్లు లేని అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇప్పించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోగురి భూషణ్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరి నారాయణ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ కొండూరి రాజేష్, సర్పంచ్లు నేరెళ్ల మహేష్, సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపల్లి ప్రసాద్, వార్డు సభ్యులు రాపర్తి నర్సింగరావు, నాయకులు గుర్రం ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్, గోల్కొండ రాజు, చింటు, కవ్వం మధు, సోమ వెంకీ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ నిరసన దీక్ష

ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్



**కొడిమ్యాల ఆగస్టు.10(.నవగీతం)** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని, తమపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు నిరసన దీక్ష చేపట్టారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు దీక్షలో పాల్గొని ప్రభుత్వానికి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..తమపై అన్యాయంగా, అక్రమంగా కేసులు నమోదు చేశారని ఆరోపించారు. కేసుల కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం తమపై కేసులు నమోదు చేయడం సరికాదని పేర్కొన్నారు. నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించడంతో పాటు తమపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని నారాయణపూర్ గ్రామస్తులు స్పష్టం చేశారు.

## హుస్సేన్ సాగర్‌లో టేకాఫ్..

### ప్రకాశం బ్యారేజీలో ల్యాండింగ్.. రెండు రాష్ట్రాల సీ ప్లేన్ సర్వీసులు

**హైదరాబాద్ బీ** తెలుగు రాష్ట్రాల మధ్య సరికొత్త పర్యాటక శకానికి శ్రీకారం చుట్టే సీ-ప్లేన్ ప్రాజెక్టు ఊహల నుంచి ఆచరణ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ, కేంద్రం సానుకూలతతో ఈ ప్రతిష్ఠాత్మక పథకం పట్టాలెక్కుతోంది. ఈ క్రమంలోనే, హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో 'వాటర్ ఏరోడ్రోమ్' ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేశారు. హుస్సేన్‌సాగర్ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు విమానంలో ప్రయాణించే అద్భుత అనుభూతిని ప్రజలకు అందించడమే లక్ష్యంగా కసరత్తు ముమ్మరమైంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమై ఈ ప్రతిపాదనను చర్చించారు. హుస్సేన్‌సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీ-ప్లేన్ సేవలు ప్రారంభిస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఒక

## తల్లాడ వీడీసీ చైర్మన్‌గా ఎన్నికైన రెడ్డెం రామకృష్ణారెడ్డికి ఘన సన్మానం




**తల్లాడ, ఆగస్టు 10(నవగీతం):** ?తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి కమిటీ (వీడీసీ) చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రెడ్డెం రామకృష్ణారెడ్డిని ఆయన పదవ తరగతి సహచర స్నేహితులు ఘనంగా సన్మానించారు. సోమవారం నారాయణపురంలోని ఆయన నివాసంలో పూర్వ విద్యార్థులందరూ ఒక్కటయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి దంపతులను శాలువాలతో సత్కరించి, తమ అభినందనలు తెలియజేశారు. ?తమతో కలిసి చదువుకున్న స్నేహితుడికి ఈ ఉన్నత పదవి రావడం ఎంతో ఆనందంగా ఉందని స్నేహితులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో తల్లాడ గ్రామం అన్ని రంగాల్లోనూ మరింత అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో స్నేహితులు జమలయ్య, ఉదయశ్రీ, శ్రీనివాసరావు, రమేష్, భాస్కర్ రావు, శివరామచంద్రమూర్తి, వెంకటేశ్వర్లు, రవి, అజయ్ కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన ప్రదర్శన, రాస్తారోకో




**తల్లాడ, ఆగస్టు 10(నవగీతం):** ?కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు మరియు ఎస్కేయం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం తల్లాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా బస్టాండ్ ప్రాంతానికి చేరుకున్నారు. బస్టాండ్ ఎదుట వారు చేపట్టిన రాస్తారోకో కారణంగా అర్ధగంటకు పైగా భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ?ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు, రైతు సంఘం మరియు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ట్రాఫిక్ నిలిపివేసి రాస్తారోకో నిర్వహించిన ఆందోళనకారులను ఎస్సై వెంకటకృష్ణ అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు సేలం పకీరమ్మ,జిల్లా నాయకులు సేలం సత్యనారాయణ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు నల్లమోతు మోహన్ రావు, సిఐటియు జిల్లా నాయకులు సత్తెనపల్లి నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పులి కృష్ణయ్య, మరియు పలువురు ఇతర సంఘాల నాయకులు తాళ్ల రాణి, దూళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎలుక కమలాకర్




**మల్లాపూర్,ఆగస్టు10,(నవగీతం):** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎలుక కమలాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట నరసయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఎలుక కమలాకర్‌కు నియామక పత్రాన్ని మగ్గిడి వెంకట నరసయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయడంతో పాటు, యువతను సంఘటితం చేసి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. నూతనంగా నియమితులైన జిల్లా ఉపాధ్యక్షుడు ఎలుక కమలాకర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట్ నరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్క మోహన్, రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల శ్రీధర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెంటపర్తి అశోక్, మెట్‌పల్లి డివిజన్ కమిటీ నాయకులు తుక్కారామ్, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు శోభన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం నిరంతరం పనిచేస్తానని, యువజన సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## దేవాలయాల అభివృద్ధి కమిటీ నియామకం

చైర్మన్, వైస్ చైర్మన్ ను సన్మానించిన  ప్రజా ప్రతినిధులు

**మల్లాపూర్,ఆగస్టు10,(నవగీతం):**



మల్లాపూర్ దేవాలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన క్యాతం సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన గంగ నర్సయ్య లను మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు  ఏలాల జలపతి రెడ్డి,ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, మాజీ అధ్యక్షుడు సంగ గంగరాజం తదితరులు నూతనంగా ఎన్నికైన చైర్మన్, ఉపాధ్యక్షులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. మల్లాపూర్‌లోని దేవాలయాల అభివృద్ధికి కమిటీ సమష్టిగా కృషి చేయాలని, ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల పెద్దమనుషులు ఎగుర్ల కొమురయ్య,చిప్పశంకర్,తోట శాంతరాజం వెల్మల రాజారెడ్డి, , ఏనుగు వెంకట్ రెడ్డి, మరిపెల్లి మల్లయ్య పుంద్ర లక్ష్మారెడ్డి, నుతిపెల్లి రాజం, పలువురు ప్రముఖులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఆగస్టు 2026

# తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి.

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్.**



**ఇల్లంతకుంట, ఆగస్టు10 (నవగీతం)** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల స్థాయి సమావేశం సోమవారం రోజు మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓరుగంటి ఆనంద్ మాట్లాడుతూ ప్రతి తెలంగాణ ఉద్యమకారునికి న్యాయం జరిగే విధంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పని చేస్తుందని,ప్రభుత్వం వెంటనే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు నివ్వాలని అని అన్నారు.మండల ఉద్యమకారులు ఐక్యంగా ఉండి మన లక్ష్యం సాధించాలని పిలుపునిచ్చారు, ప్రతి ఉద్యమకారునికి 25 వేల పింఛన్ ఉచిత బస్సు ప్రయాణం 250 చదరపు గజాల భూమి 10 లక్షల రూపాయలు ఇల్లు నిర్మాణమునకు, పిల్లలకు ఉచిత విద్య వైద్యం, ఐడెంటి కార్డు, సర్టిఫికెట్ ఇచ్చి గౌరవించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, మళ్లీ తిరిగి ఉద్యమకారులకు అన్యాయం జరిగి లేదా మోసం చేసిన యెడల తిరిగి ఉద్యమకారులు వారి ఆత్మగౌరవం నిలబడేంతవరకు కూడా పోరాటం చేయడానికి సంసిద్ధత కావాలనీ అని అన్నారు.పార్టీలకతీతంగా ఉద్యమకారులకు అండగా టి యు ఎఫ్ ఉంటుంది అని అన్నారు.ఇది ప్రతి తెలంగాణ ఉద్యమకారుని ఆత్మ గౌరవానికి సంబంధించిన పోరాటం కాబట్టి కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు, తెలంగాణ ఉద్యమకారులు అందరూ తెలంగాణ పోరాటంలో చేసిన పోరాటాలను జ్ఞాపకం చేసుకొని ఎంత కష్టపడ్డారో ఏ విధంగా త్యాగం చేశారో అందరు గుర్తు చేసుకున్నారు . మండలంలోని వివిధ గ్రామాల నుండి 150 మంది ఉద్యమకారులు పాల్గొన్నారు. మండల ఉద్యమకారులను ఐక్యంగా ఉండడానికి పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పడగల రవీందర్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు జరిగే కోటేశ్వర్, సర్పంచ్ యం .రాజు, చల్ల నవీన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ రాజేశం, ఉద్యమకారుల గౌరవ అధ్యక్షులు చల్ల నారాయణ,మండల అధ్యక్షుడు బట్టి చంద్రమౌళి, ఎన్నికల అధికారి గజ్జల రాజశేఖర్ గౌడ్, మాజీ సర్పంచులు ప్రజాప్రతినిధులు తెలంగాణ ఉద్యమకారులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిగ్ ప్లాన్‌లో బీజేపీ

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత పట్టు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కమలనాథులు, ఈసారి ఎలాగైనా తెలంగాణ గద్దెనెక్కాలనే స్పష్టమైన దిశానిర్దేశంతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో జరిగిన కీలక సమీక్షా సమావేశం, రాబోయే రోజుల్లో బీజేపీ అనుసరించబోయే రాజకీయ వ్యూహానికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది.తెలంగాణ బీజేపీకి ప్రధాన ప్రతిబంధకంగా మారిన పాత, కొత్త నేతల మధ్య విభేదాలను, అంతర్గత కలహాలను వెంటనే పక్కన పెట్టాలని పార్టీ అధిష్ఠానం స్పష్టం చేసింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, రఘునందన్ రావు సహా ముఖ్య నేతలందరూ ఒకే తాటిపైకి వచ్చి పోరాడాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. గతంలో కరీంనగర్, మేడ్చల్ అర్బన్, వికారాబాద్ జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకంపై నలుగుతున్న వివాదాలను సైతం బండి సంజయ్, ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డిల సూచనలకు ప్రాధాన్యం ఇస్తూ సర్దుబాటు చేయడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఐక్యతను నింపే ప్రయత్నం జరిగింది.భవిష్యత్తులో బిఆర్ఎస్ లేదా ఇతర పార్టీలతో పొత్తులు ఉంటాయనే ప్రచారాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముగింపు పలికారు. రాబోయే ఎన్నికల్లో జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికల్లోనైనా తెలంగాణలో ఏ ఇతర పార్టీతోనూ పొత్తు ఉండదని, ఒంటరిగానే పోటీ చేస్తామని తేల్చి చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో సమీకరణాలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ స్వయం సమృద్ధి దృష్ట్యా ఒంటరి పోరాటమే శ్రేయస్కరమని పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో గణనీయమైన ఓటు బ్యాంకు సాధించామని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం సీట్ల సంఖ్య పెరిగితే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత సత్తా సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, యువత సమస్యలపై పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ధర్నాలు, నిరసనలు చేపడుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' వంటి ఫలాలను పేదలకు చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు.మండల స్థాయి నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ప్రతి నెలా నిలకడగా సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతీ మూడు నెలలకోసారి కేంద్రీయ నేతలు రాష్ట్రాన్ని సందర్శించేలా పక్కా ప్రణాళిక రూపుదిద్దుకుంది. నేతల మధ్య ఉన్న చిన్న చిన్న భేదాభిప్రాయాలు పక్కనబెట్టి, వ్యూహాత్మకంగా ముందుకు సాగితే తెలంగాణ పీఠం దక్కడం అసాధ్యమేమీ కాదని కమలనాథులు భావిస్తున్నారు.



**బండి సంజయ్ నివాసంలో సమావేశాలు..**

బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాజకీయాల్లో మరో మలుపు తీసుకుంటూ వ్యూహాత్మకంగా కదులుతోంది. ఒకవైపు వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్, గుజరాత్‌లో గెలుపుపై దృష్టి సారించిన కమలం పార్టీ మరోవైపు దరక్షిణాన పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటక తర్వాత గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో పార్టీలో జోష్ పెంచడంతోపాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేలా వ్యూహాలు రూపొందిస్తోంది. త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ పోరులో విజయం సాధించాలనే లక్ష్యంతో కేంద్ర స్థాయి నుంచి స్పష్టమైన దిశానిర్దేశం జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీని వేదికగా రాష్ట్ర నాయకుల సమావేశాలు జరగడం, పార్టీలో సమన్వయాన్ని పెంచే ప్రయత్నాలు ఈ వ్యూహానికి ప్రధాన అంశాలుగా మారాయి.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ బలమైన పనితీరు చూపాలనే ఆలోచనతో బీజేపీ అధిష్ఠానం పని చేస్తోంది. హైదరాబాద్‌లోని మున్సిపల్ ఎన్నికలు పార్టీకి కీలక పరీక్షగా మారనున్న నేపథ్యంలో, రాష్ట్ర స్థాయి నాయకత్వం, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత బలం పెంచే దిశగా చర్చలు సాగుతున్నాయి. కేవలం ఎన్నికల క్యాంపెయిన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక రాజకీయ బలాన్ని నిర్మించే దృష్టితో వ్యూహాలు రూపొందుతున్నట్లు అర్థమవుతోంది.ఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం రాష్ట్ర నాయకుల సమావేశాలకు ముఖ్య వేదికగా మారింది. ఇక్కడ జరుగుతున్న చర్చలు కేవలం సాధారణ సమావేశాలుగా కాకుండా, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలకు దారితీస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులు, కేంద్ర నాయకత్వం మధ్య నేరుగా సంప్రదింపులు జరగడం వల్ల సమస్యలను త్వరగా గుర్తించి, పరిష్కార మార్గాలు చర్చించే అవకాశం ఏర్పడుతోంది. ఇది పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించే దిశగా ఉన్నట్లు కనిపిస్తోంది.పార్టీలోని వర్గ విభేదాలను అధిగమించి, ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశం అధిష్టానం నుంచి స్పష్టంగా వస్తోంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో జరిగిన చర్చల్లో ఈ అంశం ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయం సాధించాలంటే అంతర్గత సమస్యలు అడ్డంకిగా మారకూడదనే అవగాహనతో, నాయకుల మధ్య సమన్వయం పెంచే చర్యలు చేపట్టబడుతున్నాయి. ఇది పార్టీ సంస్థాగత బలాన్ని పెంచి, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవకాశం కలిగిస్తుంది.ఢిల్లీలో జరుగుతున్న ఈ కదలికలు తెలంగాణలో బీజేపీ స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసే ప్రయత్నంగా భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు అంతర్గత ఐక్యతను నిర్ధారించుకోవడం, స్పష్టమైన బాధ్యతల పంపిణీ, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం వంటివి ఇప్పుడు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ వ్యూహం ఎంతవరకు ఫలితాలు ఇస్తుందనేది రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షాల పనితీరు, ప్రజా స్పందనపై ఆధారపడి ఉంటుంది. అయితే అధిష్టానం స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడం, సమన్వయాన్ని ప్రోత్సహించడం పార్టీకి సానుకూల సంకేతంగా నిలుస్తోంది.మొత్తంమీద ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ చర్చలు, సమావేశాలు తెలంగాణలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల లక్ష్యం, అంతర్గత ఐక్యత, సంస్థాగత సమన్వయం ఈ మూడు అంశాలపై దృష్టి సారించి అధిష్టానం ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

## తెలంగాణ కేబినెట్ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్..

**హైదరాబాద్ :** తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతోపాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే, కేబినెట్ నుంచి ఒకరికి ఉద్వాసన పలుకుతారని గతంలో ప్రచారం జరిగినప్పటికీ.. ప్రస్తుతం ఆమేరకు అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం అందరిలో ఉత్కంఠ నెలకొంది.పక్క రాష్ట్రమైన కర్ణాటలో మంత్రివర్గ విస్తరణ పూర్తయిన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తన ఫోకస్‌ను తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పెట్టినట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళు పూర్తయింది. పలువురు సీనియర్, జూనియర్ ఎమ్మెల్యే మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వాలంటూ ఇప్పటికే పలు దఫాలుగా కేంద్ర పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పలు సందర్భాల్లో బహిరంగంగానూ మంత్రి పదవి దక్కలేదని తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యే మంత్రి పదవి కోసం తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఈసారి కేబినెట్ విస్తరణలో ఎవరికి అదృష్టం వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.కేబినెట్ విస్తరణకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతో పాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రెండు బెర్త్ లలో ఎస్టీ, రెడ్డి సామాజిక వర్గాల వారికి చాన్స్ దక్కే అవకాశం ఉంది. ఎస్టీ సామాజిక వర్గం నుంచి రేసులో రామచంద్రు నాయక్, బాలు నాయక్ లు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఒకరికి మంత్రి పదవి దక్కేఅ వకాశాలు ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు.. రెడ్డి సామాజిక వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, సుందర్శన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి.తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదు. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ కొనసాగుతున్నారు. అయితే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి కేటాయించాలని స్థానిక నేతలు కోరుతున్నారు. అధిష్టానం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాధాన్యం ఇస్తే.. ఆ జిల్లాకు చెందిన మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిలలో ఎవరికో ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. మరోవైపు.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రేసులో సుందర్శన్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. మరో పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ పూర్తవుతుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటుండగా.. వీరిలో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది. ఈసారి మంత్రి వర్గ విస్తరణలో భాగంగా ప్రస్తుత కేబినెట్‌లో కొనసాగుతున్న వారిలో ఒకరికి ఉద్వాసన పలికే అవకాశాల ఉన్నట్లుగా ఇటీవల కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే, ఇప్పుడు అలాంటిదేమీ లేదని తెలుస్తోంది. ఒకవేళ ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న ఒకరికి ఉద్వాసన పలికితే అదే సామాజిక వర్గం నుంచి మరొకరికి చాన్స్ దక్కే అవకాశాలు ఉన్నాయి.

## సురక్షితంగా తీసుకొస్తాం..

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు.

**వివరాల్లోకి వెళితే...**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒకరితో సహా మొత్తం ఆరుగురు యువకులు మంచి ఉద్యోగాల కోసం ఓ ఏజెంట్‌ను నమ్మి థాయ్‌లాండ్‌కు వెళ్లారు. అయితే, అక్కడకు చేరాక వారు మోసపోయారని గ్రహించారు. సైబర్ నేరాలకు పాల్పడే ఓ ముఠా వీరిని నిర్బంధించి, తీవ్రమైన ఒత్తిడి, వేధింపులకు గురిచేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి బలవంతంగా దించింది. ఈ నరకం నుంచి బయటపడేందుకు బాధితులు ఎలాగోలా కొంత డబ్బు చెల్లించి, వారి చెర నుంచి తప్పించుకున్నారు. ప్రస్తుతం వారు థాయ్‌లాండ్ వైపు ఉన్న మయన్మార్ సరిహద్దు ప్రాంతానికి చేరుకుని అక్కడే చిక్కుకుపోయారు. తమను ఎక్కడికైనా తరలించే ప్రమాదం ఉందని భయపడుతూ, తమను రక్షించాలంటూ సోషల్ మీడియా ద్వారా వేడుకున్నారు. ఈ వీడియోలు, పోస్టులు వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**స్పందించిన మంత్రి లోకేశ్**

ఈ విషయం తన దృష్టికి రావడంతో మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. బాధితుల ఆందోళన, వేదనను తాను అర్థం చేసుకోగలనని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న యువత పరిస్థితి గురించి తెలిసింది. వారి కుటుంబ సభ్యుల ఆందోళనను అర్థం చేసుకోగలను. బాధితులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని లోకేశ్ హామీ ఇచ్చారు. తక్షణమే అధికారులతో మాట్లాడి, కేంద్ర విదేశాంగ శాఖ, సంబంధిత రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు తన కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ చర్యలతో బాధితులు త్వరలోనే సురక్షితంగా స్వదేశానికి తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తమవుతోంది.

## పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు కేటాయించిన భూములను సెక్షన్ 22-ఏ పరిధిలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి వారికి పట్టాలు అందించిందని గుర్తుచేశారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు**

2019-2024 మధ్య గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం రెవెన్యూ రికార్డులను తీవ్రంగా దెబ్బతీసిందని చంద్రబాబు ఆరోపించారు. భూములు, ఆస్తులను డిజిటల్‌గా 22-ఏ పరిధిలోకి తెచ్చి వివాదాలు సృష్టించారని మండిపడ్డారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులను శుభ్రపరిచి, క్రమబద్ధీకరించేందుకు 'రెవెన్యూ రికార్డ్స్ రిఫార్మ్స్ 2026'ను ప్రవేశపెట్టినట్లు వివరించారు.

**పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు**

కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్కులలో కరెన్సీ నోట్లకు వినియోగించే తరహాలోనే పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని సీఎం తెలిపారు. ఆస్తుల వివరాలను మార్చేందుకు వీలులేకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని, దీనికి అదనంగా క్యూఆర్ కోడ్ వంటి సాంకేతిక భద్రతా ఫీచర్లను పొందుపరిచామన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తూ, వారి ఈ-కేవైసీ తీసుకున్నాకే గ్రామసభలు పెట్టి పారదర్శకంగా పాస్‌బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 32.22 లక్షల పట్టాదారు పాస్‌బుక్కులు రైతులకు, భూ యజమానులకు అందజేశామని, రాబోయే ఏడు నెలల్లో 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్‌బుక్కులు జారీ చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 41,000 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడం ద్వారా 1.27 లక్షల మంది రైతులకు, పరిశ్రమలకు, ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారు సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని గుంటూరు ఘటనను ఉదాహరణగా చూపిస్తూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేసి, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు

## గోవింద నామాలతో పేరడీలా?



-మొదటిపేజీ తరువాయి

స్పందించారు. వైఎస్సార్సీపీ నేతల వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

**భక్తుల మనోభావాలు దెబ్బతీశారు**

పవిత్రమైన గోవింద నామాలను రాజకీయాలకు వాడుకోవడం దారుణమని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. పేరడీల పేరుతో భక్తుల మనోభావాలను వైఎస్సార్సీపీ నేతలు తీవ్రంగా కించపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందన్నారు. వారి వైనం కోట్లాది మంది భక్తుల ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వార్థం కోసం దేవుడిని వివాదాల్లోకి లాగడం ఏమాత్రం సరికాదని హితవు పలికారు.

**చట్ట ప్రకారం ముందుకెళ్లండి**


మతపరమైన విద్వేషాలు రేపే కుట్రపూరిత ఆలోచనలతోనే వైఎస్సార్సీపీ నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడ్డారని పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరు ఘటనలో పాల్గొన్న వారిపై చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని జనసేన పార్టీ నాయకులకు, శ్రేణులకు ఆయన కఠిన ఆదేశాలు జారీ చేశారు. భక్తుల ధార్మిక విశ్వాసాలు దెబ్బతీసిన వారిపై న్యాయపరంగా పోరాడాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**ప్రతిపక్ష హోదా కూడా లేని పార్టీ**

ఈ సందర్భంగా వైఎస్సార్సీపీపై పవన్ కల్యాణ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని పార్టీ వైఎస్సార్సీపీ అంటూ ఆయన ఎద్దేవా చేశారు. అలాంటి పార్టీ రాజకీయాల కోసం ఇంతటి దిగజారుడు చర్యలకు పాల్పడటం విచారకరం అన్నారు. ధార్మిక విశ్వాసంలో భాగమైన దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలు, పవిత్ర కీర్తనలను అపహాస్యం కోసం వాడే విధానాన్ని నాయకులందరూ తక్షణమే విడిచిపెట్టాలని పవన్ కల్యాణ్ సూచించారు. రాజకీయ నిరసనలు హుందాగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి కానీ, భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్సీపీ నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో శ్రీవారి భక్తిగీతాలను పేరడీ చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించారని జనసేన నాయకులు ఆరోపించారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఆగస్టు 2026

# పాన్ ఇండియా మార్కెట్‌లోకి కిరణ్ అబ్బవరం



తెలుగు యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం ఒకడు. షార్ట్ ఫిల్మ్స్‌తో కెరీర్ ప్రారంభించి, రాజావారు రాణిగారు' మూవీతో హీరో అయ్యాడు. తర్వాత పలు సినిమాలు చేశాడు గానీ చాలావరకు ఫ్లాపులే. ఎట్టకేలకు 'క' అనే థ్రిల్లర్ సినిమాతో సక్సెస్ అందుకున్నాడు. దీని తర్వాత వచ్చిన 'దిల్‌రుబా' డిజాస్టర్ కాగా.. కె ర్యాంప్, చెన్నై లవ్ స్టోరీ చిత్రాలు సక్సెస్ అయ్యాయి. ప్రస్తుతం ఓ వెబ్ సిరీస్, దర్శకుడిగా ఓ మూవీ చేస్తున్న కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు పాన్ ఇండియా వైడ్ తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. 'ఇంద్రపుత్ర' పేరుతో మూవీని అనౌన్స్ చేశారు. సోమవారం ఈ టైటిల్ ప్రకటిస్తూ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. కాటమరాయుడు, గాండీవధారి అర్జున, కుడి ఎడమైతే, కాంతార ఛాప్టర్ 1 సినిమాలకు పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల దీంతో దర్శకుడిగా మారుతున్నాడు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం పాన్ ఇండియా ప్రయత్నం మెచ్చుకోదగిందే గానీ అదెంత వరకు వర్కౌట్ అవుతుందనేది భవిష్యత్తులో తెలుస్తుంది. ఎందుకంటే పోస్టర్ చూస్తుంటే డివోషనల్ స్టోరీలా అనిపిస్తుంది. కానీ ఈ జానర్ ఇప్పుడు పాతబడిపోయింది. అదే టైంలో కిరణ్ మార్కెట్ కూడా టాలీవుడ్ వరకే పరిమితం. ఈ నిర్మాత గతంలో తెలుగు హీరో సుధీర్ బాబుతో 'జటాధర' అని ఓ మూవీ చేస్తే అది ఘోరంగా ఫెయిలైంది. మరి ఈసారి ఏం చేస్తారనేది చూడాలి?

# ప్రభాస్ మూవీలో ఛాన్స్.. మీ టాలెంట్ బయటికి తీయండి!

ప్రభాస్- నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన సైన్స్ ఫిక్షన్ మూవీ కల్కి 2898 ఏడీ. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ చిత్రంలో దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, కీలక పాత్రల్లో కనిపించారు. ప్రస్తుతం ఈ మూవీ సీక్వెల్ పనులతో బిజీగా ఉన్నారు నాగ్ అశ్విన్. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి అదిరిపోయే న్యూస్ చెప్పారు మేకర్స్. ఈ చిత్రంలో మీరు కూడా భాగం అవ్వాలని అనుకుంటున్నారా? ప్రభాస్ మూవీలో ఛాన్స్ కొట్టేయాలనుందా? మరి ఇంకెందుకు ఆలస్యం మీ టాలెంట్ చూపించే వీడియోలను పంపండి. ఈ క్రేజీ ఛాన్స్ కొట్టేయండి అంటున్నారు మేకర్స్. తాజాగా ఈ సీక్వెల్ మూవీలో నటించాలనుకునే వారి కోసం క్యాస్టింగ్ కాల్ వచ్చేసింది. ఈ అరుదైన గోల్డెన్ ఛాన్స్‌ను మీ రెండు చేతులతో ఒడిసి పట్టుకోండి. నటనపై ఆసక్తి, ప్రతిభ ఉన్నవారికి ఎలాంటి షరతులు లేకుండా ఈ మూవీ ఛాన్స్ ఇస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ క్రేజీ ఛాన్స్ కోసం తమ వివరాలను, పోర్ట్‌ఫోలియోలను ఝశ్రీనెఱబఅఱజవతీంవఝర్‌ఱఅస్త్రఏస్త్రఝఱశ్రీ.ఝశీఎ అనే మెయిల్ చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం మీలోని టాలెంట్ బయటికి తీసి ప్రభాస్ మూవీలో నటించే ఛాన్స్ కొట్టేయండి.





# పాన్ ఇండియా మార్కెట్‌లోకి కిరణ్ అబ్బవరం

తెలుగు యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం ఒకడు. షార్ట్ ఫిల్మ్స్‌తో కెరీర్ ప్రారంభించి, రాజావారు రాణిగారు' మూవీతో హీరో అయ్యాడు. తర్వాత పలు సినిమాలు చేశాడు గానీ చాలావరకు ఫ్లాపులే. ఎట్టకేలకు 'క' అనే థ్రిల్లర్ సినిమాతో సక్సెస్ అందుకున్నాడు. దీని తర్వాత వచ్చిన 'దిల్‌రుబా' డిజాస్టర్ కాగా.. కె ర్యాంప్, చెన్నై లవ్ స్టోరీ చిత్రాలు సక్సెస్ అయ్యాయి. ప్రస్తుతం ఓ వెబ్ సిరీస్, దర్శకుడిగా ఓ మూవీ చేస్తున్న కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు పాన్ ఇండియా వైడ్ తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. 'ఇంద్రపుత్ర' పేరుతో మూవీని అనౌన్స్ చేశారు. సోమవారం ఈ టైటిల్ ప్రకటిస్తూ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. కాటమరాయుడు, గాండీవధారి అర్జున, కుడి ఎడమైతే, కాంతార ఛాప్టర్ 1 సినిమాలకు పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల దీంతో దర్శకుడిగా మారుతున్నాడు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం పాన్ ఇండియా ప్రయత్నం మెచ్చుకోదగిందే గానీ అదెంత వరకు వర్కౌట్ అవుతుందనేది భవిష్యత్తులో తెలుస్తుంది. ఎందుకంటే పోస్టర్ చూస్తుంటే డివోషనల్ స్టోరీలా అనిపిస్తుంది. కానీ ఈ జానర్ ఇప్పుడు పాతబడిపోయింది. అదే టైంలో కిరణ్ మార్కెట్ కూడా టాలీవుడ్ వరకే పరిమితం. ఈ నిర్మాత గతంలో తెలుగు హీరో సుధీర్ బాబుతో 'జటాధర' అని ఓ మూవీ చేస్తే అది ఘోరంగా ఫెయిలైంది. మరి ఈసారి ఏం చేస్తారనేది చూడాలి?



# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న 'ది ఒడిస్సీ'..

## క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లోనే నంబర్ వన్

హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల నుంచి భారీ స్పందన అందుకుంటున్న ఈ సినిమా.. ఈ వీకెండ్‌లో ఏకంగా రెండు ప్రతిష్ఠాత్మక రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. ముఖ్యంగా నోలన్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలవడం విశేషం. 'ది ఒడిస్సీ' ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వి1.1 బిలియన్ గ్రాస్ వసూళ్లను అందుకుంది. దీంతో ఇప్పటివరకు క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఉన్న 'ది డార్క్ నైట్ రైజెస్' రికార్డును ఈ సినిమా అధిగమించింది. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. చైనా, జపాన్ వంటి కీలక అంతర్జాతీయ మార్కెట్లలో సినిమా పూర్తిస్థాయిలో విడుదల కాకముందే ఈ మైలురాయిని చేరుకుంది. ఈ రెండు మార్కెట్లలో విడుదలైన తర్వాత 'ది ఒడిస్సీ' కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.క్రిస్టోఫర్ నోలన్ సినిమాలకు ఐమ్యాక్స్‌తో ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'ది ఒడిస్సీ'తో ఆ బంధం మరో స్థాయికి చేరింది. ఈ సినిమా ఐమ్యాక్స్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ స్క్రీన్ల ద్వారా ఇప్పటివరకు వి289 మిలియన్లు వసూలు చేసింది. దీంతో జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'అవతార్' జీవితకాలఐమ్యాక్స్ కలెక్షన్స్ అయిన వి271 మిలియన్లను అధిగమించింది. ఇది నోలన్‌కు మాత్రమే కాకుండా ఐమ్యాక్స్ చరిత్రలోనే ప్రత్యేకమైన విజయంగా మారింది. 'ది ఒడిస్సీ'కి ఇంతటి ప్రత్యేకత రావడానికి మరో ప్రధాన కారణం ఉంది. ఈ సినిమా పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన తొలి చిత్రంగా నిలిచింది. భారీ స్థాయి విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు, ప్రకృతి దృశ్యాలను సాధ్యమైనంత అద్భుతంగా చూపించేందుకు నోలన్ ప్రత్యేకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌ను ఉపయోగించారు.థియేటర్లలో ముఖ్యంగా ఐమ్యాక్స్ 70ఎఎ స్క్రీన్లపై ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులు భారీగా ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో ఐమ్యాక్స్ 70ఎఎ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నట్లు సమాచారం.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.